ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



తమిళనాడు
TAMILNADU
ఆదివారం 14 సెప్టెంబరు 2025



భారత మాజీ ఉపరాష్ట్రపతితో పురస్కార గ్రహీతలు

ఏ నాగరికతకైనా సంస్కృతి ప్రధానం

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య
- ఘనంగా మైలాపూర్ అకాడమీ 75వ వార్షికోత్సవం
- పలువురికి పురస్కారాల ప్రదానం



ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

చెన్నై, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏ నాగరికతకైనా సంస్కృతి ప్రధానమైనదని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం మైలాపూర్‌లోని భారతీయ విద్యాభవన్‌లో జరిగిన 'ది మైలాపూర్ అకాడమీ' 75వ వార్షికోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన వెంకయ్య మాట్లాడుతూ.. మైలాపూర్ శతాబ్దాలుగా సంస్కృతికి పుట్టినిల్లుగా ప్రసిద్ధి చెందిందన్నారు. మైలాపూర్ అకాడమీ భారతదేశ గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని అందిస్తోందని ప్రశంసించారు. అంతేగాకుండా చెన్నై సాంస్కృతిక కార్యకలాపాలకు, కర్ణాటక సంగీతానికి కేంద్రంగా ఉందన్నారు. ఏడు దశాబ్దాలుగా అకాడమీ నిర్వహిస్తున్న వైద్య సేవలను కొనియాడారు. మైలాపూర్ అకాడమీ కళలు, సంగీతానికి పర్యాయపదంగా నిలిచిందని, దాని ప్రతిష్ఠాత్మక అవార్డుల ద్వారా నాటక బృందాల పోషణకు ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. కళలు, నాటకరంగం, సంగీతం, సామాజిక క్రియాశీలత, దంతసేవలు, పాఠశాల విద్య, మానసిక ఆరోగ్యం, వారసత్వం, పరిరక్షణ వంటి అనేక రంగాల్లో అవార్డులను ఇస్తోందన్నారు. అన్ని సహకారాలను సమానంగా గుర్తించినప్పుడు సమాజం సంపన్నమవుతుందని వివరించారు.

వారు పురోగతికి శిల్పులు...

పురస్కారాలు అందుకున్న వ్యక్తులంతా వారి సొంత మార్గాల్లో పురోగతికి రూపశిల్పులని, అకాడమీ ఈ కార్యక్రమం ద్వారా ప్రపంచానికి గుర్తు చేస్తోందని ప్రశంసించారు. 'ధర్మాత్మ డాక్టర్ వి.వైద్యసుబ్రమణ్య జీవన సాఫల్య పురస్కారం' అందుకున్న భరతనాట్య, కథాకళి నృత్యకారులు వీపీ ధనంజయన్, శాంత ధనంజయన్‌కు, కైంకర్య శిరోన్మణి డాక్టర్ ఎస్‌వీ నరసింహన్ శతాబ్ది జీవిత సాఫల్య పురస్కారం' అందుకున్న డాక్టర్ నళిని కృష్ణన్, కైంకర్య శిరోమణి, సేవారత్న డాక్టర్ ఎన్‌సి రాఘవాచారి సెంటినరీ అవార్డ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు' అందుకున్న చరిత్రకారుడు, రచయిత, మ్యూజిక్ అకాడమీ కార్యదర్శి శ్రీరాం వెంకటకృష్ణన్, 'డాక్టర్ సరోజిని వరదప్పన్ అవార్డు' గ్రహీత సామాజిక కార్యకర్త డాక్టర్ వందన గోపీకుమార్‌ను వెంకయ్య ప్రత్యేక అభినందించారు. జంతు సంక్షేమం, ప్రత్యేక విద్య, ఇతర విభాగాల్లో అత్యుత్తమ విజయాలు, అసాధారణ విజయాల కోసం అకాడమీ నేడు అనేక ఇతర అవార్డులను ప్రదానం చేస్తోందని, ఈ అవార్డుల విస్తృతి మైలాపూర్ అకాడమీ చోదక శక్తి అయిన సమగ్ర స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. మైలాపూర్ క్లబ్ ఈ గొప్ప చొరవ అవార్డు గ్రహీతలు విలువైన అడుగు జాడల్లో నడవడంతో పాటు ఇతరులకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. ఈ పురస్కారాల ప్రదానం, గుర్తింపు సేవ చేసే వారి చేతలు బలోపేతం కావడానికి దోహదపడుతుందన్నారు. ఒక దేశం ప్రసిద్ధులను, శక్తివంతులను మాత్రమే గౌరవించినప్పుడే గాక సమాజంలోని నైతిక, సాంస్కృతి, విద్య, మానవ కోణాలను నిర్మించేవారిని కూడా గౌరవించినప్పుడే బలంగా పెరుగుతుందని ఇది అందరికీ గుర్తు చేస్తుందని వెంకయ్య పేర్కొన్నారు. ఈ వేడుకలకు అకాడమీ అధ్యక్షుడు, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎస్.జగదీశన్ అధ్యక్షత వహించగా, భారత మాజీ రాయబారి టీఎస్ తిరుమూర్తి, ప్రముఖ వ్యాపారవేత్త నల్లి కుప్పుస్వామిచెట్టి గౌరవ అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక సంచికను ఆవిష్కరించిన అతిథులు, వివిధ రంగాల్లో విశేష సేవలందించిన పలువురికి విశిష్ట పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించారు.

డీఎంకేని శత్రువులేమీ చేయలేరు

- నాశనం చేస్తామన్నవారంతా పత్తాలేకుండా పోయారు
- కరూర్ 'ముప్పెరుం విళా'కు తరలిరండి
- పార్టీ శ్రేణులకు అధ్యక్షుడు స్టాలిన్ లేఖ



చెన్నై, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పాత వాళ్లే కాదు, కొత్తగా పుట్టుకొచ్చిన శత్రువులు సైతం డీఎంకేని ఏమీ చేయలేరని ఆ పార్టీ అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ అన్నారు. డీఎంకేని నాశనం చేస్తామంటూ శపథాలు చేసినవారంతా పత్తాలేకుండా పోయారని తెలిపారు. కరూరులో ఈ నెల 17 జరగనున్న ముప్పెరుం విళా సందర్భంగా శనివారం పార్టీ శ్రేణులకు స్టాలిన్ లేఖ రాశారు. పార్టీ వ్యవస్థాపకుడు అన్నాదురై జయంతి వేడుకలు, పెరియార్ జయంతి వేడుకలు, పార్టీ వ్యవస్థాపక దినోత్సవాలను కలుపుకుని త్రివిధ వేడుకలను కరూరులో నిర్వహించనున్నామన్నారు. ఈ వేడుకలకు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఏకతాటిపై తమిళనాడు పేరుతో నిర్వహించిన పార్టీ సభ్యత్వ కార్యక్రమానికి అపూర్వ స్పందన లభిస్తోందని, కోటిమందికి పైగా సభ్యత్వం పొందారని తెలిపారు. లోక్‌సభ నియోజకవర్గాల తగ్గింపు ప్రయత్నాలను వ్యతిరేకించిన విషయంలో తనకు అండగా నిలిచిన మిత్రపక్షాలకు ధన్యవాదాలు తెలిపారు. నీట్ రద్దయ్యే వరకూ తాను విశ్రమించే ప్రసక్తే లేదని, తమిళభాష, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడమే తన ధ్యేయమన్నారు. మహిళలు, రైతులు, జాలర్లు, చేనేత కార్మికులు సహా శ్రామిక వర్గాల సంక్షేమం కోసం అహరహం పోరాడుతానని, వారికి అవసరమైన నిధులను కేంద్రం నుంచి రాబట్టే వరకు నిద్రపోనన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కేంద్రానికి తలవంచనన్నారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాన్ని చూసి కేంద్రంలోని బీజేపీ పాలకులకు కంటగింపుగా ఉందన్నారు. విద్య, వైద్య విభాగాల్లో, మహిళాభ్యుదయంలో రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. వచ్చే యేడాది జరగనున్న శాసనసభ ఎన్నికల్లో విజయాన్ని సాధించే దిశగానే కరూరులో ముప్పెరుం విళాను ఏర్పాటు చేశామన్నారు.

మహాబలిపురం సాగరగర్భంలో ప్రాచీన ఆలయాలు?

7



స్టాలిన్ ఇక ఇంటికే

- పల్లడంలో ఎడప్పాడి పళనిస్వామి



రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రముఖ్యమంత్రి స్టాలిన్‌ను ఇంటికి పంపించి తీరుతామని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ఉద్ఘాటించారు. 2026లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని మక్కలై కాప్పోం-తమిళగత్తై మీడ్పోం' నినాదంతో జులై 7న ఈపీఎస్ ప్రారంభించిన ప్రచారయాత్ర 51 రోజుల్లో 150 నియోజకవర్గాల మీదుగా సాగి శనివారం తిరుప్పూర్ జిల్లా పల్లడం చేరుకుంది. ఇక్కడి ఎంజీఆర్ రోడ్డులో ఏర్పాటు చేసిన రోడ్‌షోలో ఈపీఎస్ మాట్లాడారు. డీఎంకే ప్రభుత్వం అవినీతి అక్రమాల్లో రికార్డు సాధించిందని, వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో స్టాలిన్‌ను ఇంటికి పంపించి తీరుతామన్నారు. రెండోసారి సీఎం పీఠమెక్కుతామని స్టాలిన్ కల ఫలించదన్నారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల వినియోగం విచ్చలవిడిగా సాగుతుండడంతో విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 1999లో బీజేపీతో డీఎంకే పొత్తు కుదుర్చుకుని కేంద్రమంత్రి వర్గంలో పాలుపంచుకుందని, అప్పట్లో ఆ పార్టీని మంచి పార్టీ అని కొనియాడారన్నారు.ప్రస్తుతం ఆ పార్టీతో చేతులు కలిపిన అన్నాడీఎంకేను విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తాము ఏ కూటమిలో చేరినా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటామన్నారు. కులం, మతం, జాతి, భాషా విభేదాలు లేకుండా అందరిని సమానంగా చూస్తామన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆచరణకు సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన డీఎంకే పట్ల ప్రజలు నమ్మకం కోల్పోయారన్నారు. డీఎంకేను ప్రారంభించినప్పటి నుంచి ఉన్న పలు నాయకుల్లో ఎవరికి పార్టీలో, ప్రభుత్వంలో ఎలాంటి పదవులు కట్టబెట్టలేదని, డీఎంకే అధ్యక్షుడిగా వ్యవహరించిన కరుణానిధి తర్వాత ఆ పదవిని ఆయన కుమారుడు స్టాలిన్ చేపట్టారన్నారు. అలాగే పలువురు సీనియర్లు ఉన్నప్పటికీ ఉదయనిధి స్టాలిన్‌కు డిప్యూటీ సీఎం, కనిమొళికి పార్టీ పదవితో పాటు ఎంపీ పదవిని కట్టబెట్టారన్నారు. ఈ రకంగా డీఎంకేలో ప్రజాస్వామ్యం కనిపించకుండా పోయిందని ఈపీఎస్ ధ్వజమెత్తారు. ఈ నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజాధనాన్ని దోచుకున్న స్టాలిన్, డీఎంకే మంత్రులు మళ్లీ రెండోసారి అధికారంలోకి రావాలని ప్రజలను నమ్మించే ప్రయత్నాల్లో దిగారని, అయితే ఈసారి ప్రజలు గుణపాఠం చెబుతారని ఈపీఎస్ అన్నారు. ఈ ప్రచారంలో మాజీమంత్రులు ఎస్పీ వేలుమణి, ఉడుమలై రాధాకృష్ణన్, ఎంఎస్ఎం ఆనందన్, మాజీ ఎమ్మెల్యేలు కారైపుదూరు నటరాజన్, పరమశివన్‌తో పాటు పార్టీ నిర్వాహకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చని ఆ పార్టీకి ఎలా ఓటేస్తారు?

- మహిళలకు 40 శాతం రిజర్వేషన్లు ఏమయ్యాయి
- మహిళల్ని 'ఓసీ' పయనం అంటూ కించపరుస్తారా
- డీజిల్ ధర తగ్గింపు మరచిపోయారా?
- తిరుచ్చి రోడ్‌షోలో డీఎంకేపై ధ్వజమెత్తిన టీవీకే అధినేత విజయ్
- తొలిరోజు ప్రచారానికి భారీ స్పందన



భారీగా తరలివచ్చిన జనం - ప్రజలకు విజయ్ అభివాదం

చెన్నై, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): 'గత నాలుగున్నరేళ్లుగా డీఎంకే ప్రకటించిన హామీలను అమలు చేసిందా? హామీలు నెరవేర్చని ఆ పార్టీకి మీరెలా ఓటేస్తారు?' అంటూ శనివారం మధ్యాహ్నం తిరుచ్చి రోడ్‌షోలో టీవీకే అధినేత, ప్రముఖ సినీనటుడు విజయ్ ప్రజల్ని నిలదీశారు. పార్టీని ప్రారంభించిన అనంతరం విక్రవాండి, మదురై నగరాలెకల మహానాడు నిర్వహించిన విజయ్.. తొలిసారిగా అసెంబ్లీ ఎన్నికల ప్రచారం కోసం జనం ముందుకొచ్చారు. శనివారం చెన్నై నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరిన విజయ్ ఉదయం 9.30 గంటలకు తిరుచ్చి విమానాశ్రయం చేరుకున్నారు. 'కాబోయే ముఖ్యమంత్రి విజయ్, దళపతి విజయ్' అంటూ కార్యకర్తలు పెద్దపెట్టున నినాదాలు చేశారు. కార్యకర్తల సందడి కారణంగా విజయ్ విమానాశ్రయం నుంచి మెయిన్‌రోడ్డు చేరుకునేందుకు గంట పట్టింది. ఆ తర్వాత ప్రచార వాహనంలో బయలుదేరిన విజయ్‌కి స్వాగతం పలికేందుకు దారికి ఇరువైపులా కార్యకర్తలు నిలబడడంతో ఆ వాహనం నత్తనడన నడిచింది. విమానాశ్రయం నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న గాంధీమార్కెట్ మరకడైకి చేరుకునేందుకు 5 గంటల సమయం పట్టింది. 10.30 గంటలకు ప్రసంగించాల్సిన విజయ్ మధ్యాహ్నం 3 గంటల సమయంలో ప్రసంగించారు.

తిరుచ్చి అంటేనే కొత్త మలుపు..

ఈ సందర్భంగా విజయ్ ప్రసంగిస్తూ.. పూర్వం యుద్ధానికి వెళ్లే వీరులు కులదైవానికి మొక్కేవారని, ఆ తరహాలోనే తాను అసెంబ్లీ ఎన్నికల పోరుకు వెళ్తూ మత సామరస్యానికి ప్రతీకగా ఉన్న తిరుచ్చి ప్రజలను దర్శించుకుంటున్నానని చెప్పారు. ఎంజీఆర్ తొలి మహానాడు నిర్వహించిన నగరం తిరుచ్చి అని, అన్నాదురై రాజకీయాల్లో ఉన్నత స్థితికి చేరుకోవడానికి ఈ నగరమే దోహదపడిందని, పెరియార్, ఎంజీఆర్‌కు ప్రీతికరమైన నగరం ఇదేనన్నారు. తిరుచ్చి అంటేనే కొత్త మలుపు అని, అందుకే మొట్టమొదటగా తాను ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తున్నానని చెప్పారు. మలకోట పిళ్లయార్, తంద్రై పెరియార్ స్థలం తిరుచ్చి నగరమేనని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా డీజిల్ ధరను రూ.3 తగ్గిస్తామని, విద్యారుణాలను రద్దు చేస్తామని, ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 40 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామంటూ డీఎంకే హామీ ఇచ్చిందని, వాటి అమలు ఊసేలేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 23 లక్షల ఉద్యోగాల భర్తీదీ అదే దారి అన్నారు. ఈ విషయాలపై ప్రశ్నిస్తున్నా డీఎంకే నేతలు సమాధానం చెప్పలేదన్నారు. సిటీ, టౌన్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం సదుపాయం కల్పించినట్లు గొప్పలు చెప్పుకున్న డీఎంకే నేతలే 'ఓసీ ప్రయాణం చేస్తున్నారా?' అంటూ వారిని కించపరుస్తున్నారన్నారు.

అన్ని సదుపాయాలు కల్పిస్తాం...

అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే విజయం సాధిస్తే విద్యుత్, వైద్యం, విద్య వంటి ప్రధానమైన వసతులను మెరుగుపరుస్తామని, ముఖ్యంగా మహిళల భద్రతకు భరోసా ఇస్తామని విజయ్ అన్నారు. విజయ్ ప్రచార వాహనంపై నిలిచి ప్రసంగించడానికి సిద్ధం కాగానే ఆయన మైకు మొరాయించింది. 'తలైవా...: మీ మాటలు ఏవీ వినబడలేదు' అంటూ కేకలు పెట్టారు. సాంకేతిక కారణాల వల్ల మైకు పనిచేయకపోవడమే కాకుండా ఆయన ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయడానికి సిద్ధమైన టీవీ ఛానెళ్లకు కూడా సక్రమంగా లింక్‌లు కనెక్ట్ లేదు. దీనితో విజయ్ తన ప్రసంగాన్ని సంక్షిప్తంగా ముగించారు.

స్తంభించిన తిరుచ్చి...

విజయ్ పర్యటనతో తిరుచ్చి నగరం స్తంభించింది. విజయ్ అభిమానులు, పార్టీ కార్యకర్తలు శుక్రవారం మధ్యాహ్నమే తిరుచ్చికి తరలివచ్చారు. విజయ్ ప్రచార పర్యటనకు సిద్ధం చేసిన ప్రత్యేక వాహనం శుక్రవారం మధ్యాహ్నం చెన్నై నుంచి బయలుదేరినప్పుడు మార్గమధ్యంలో పలుచోట్ల పార్టీ శ్రేణులు గుమ్మడికాయలు దిష్టి తీశారు. శుక్రవారం రాత్రికల్లా వేలాదిమంది టీవీకే కార్యకర్తలు, స్థానిక శాఖ నాయకులతో తిరుచ్చి నిండిపోయింది. శనివారం వేకువజాము నుంచి రాష్ట్రం నలుమూలల నుంచి వేల సంఖ్యలో కార్యకర్తలు బస్సులు, రైళ్లు, వ్యాన్‌లలో తిరుచ్చికి చేరుకున్నారు. విజయ్ వాహనం వెనుక ఐదు కార్లు మాత్రమే వెళ్లాలని పోలీసులు నిబంధనలు విధించినా వందల సంఖ్యలో వెంబడించడం ట్రాఫిక్ స్తంభనకు కారణమైంది. విజయ్ రోడ్‌షో జరిపిన ప్రాంతంలో మిద్దెలపై నిలిచి, చెట్లపైకి ఎక్కి ఆయన ప్రసంగాన్ని వినేందుకు ఆరాటపడ్డారు. తరువాత విజయ్ అరియలూరులో రోడ్‌షోలో పాల్గొనేందుకు బయలుదేరినప్పుడు కూడా రాకపోకలు స్తంభించాయి.

ట్రాఫిక్‌లో చిక్కుకున్న చిదంబరం కారు...

రోడ్‌షో సందర్భంగా తిరుచ్చిలో స్తంభించిన ట్రాఫిక్‌లో కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం చిక్కుకున్నారు. టీవీఎస్ టోల్‌గేట్ వద్ద చిదంబరం ప్రయాణిస్తున్న కారు చిక్కుకుంది.ఈ విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని వాహనాలను క్రమబద్ధీకరించి చిదంబరం కారుకు దారిని ఏర్పాటు చేశారు.

పూలవర్షం... డ్యాన్స్‌లు...

విజయ్ పర్యటన సందర్భంగా తిరుచ్చి నగరమంతటా పార్టీ కార్యకర్తలు ఆయన ప్రయాణించిన ప్రచార వాహనంపై పూల వర్షం కురిపించారు. దారిపొడవునా కార్యకర్తలు తప్పెట్లతో సందడి చేశారు. మహిళలు తలకు పార్టీ తువ్వాలను కట్టుకుని విజయ్ సినిమా పాటలకు అనుగుణంగా రోడ్డుపై డ్యాన్స్‌లు చేశారు. మరకడై ప్రాంతం నలువైపులా ఉన్న భవనాలపై, చెట్ల కొమ్మలపై, పిట్టగోడలపై కార్యకర్తలే కనిపించారు.



ఇళయరాజాకు జ్ఞాపికను బహూకరిస్తున్న సీఎం

ఓటమిలోనే గెలుపు గొప్పదనం తెలుస్తుంది: రజనీకాంత్

- కమల్‌కు స్పెషల్ సంగీతం
- సంగీత 'రారాజు'కు ఘనసన్మానం

అడయార్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గెలుపులోనే ఓటమి గొప్పదనం తెలుస్తుందని సూపర్‌స్టార్ రజనీకాంత్ అన్నారు. 'ఇసైజ్ఞాని' ఇళయరాజా సినీ సంగీత ప్రపంచంలో 50 యేళ్లు పూర్తి చేసుకున్నందుకు రాష్ట్రప్రభుత్వం తరపున చెన్నైలో సన్మాన కార్యక్రమం జరిగింది. ఇందులో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్, అగ్ర నటులు కమలహాసన్, రజనీకాంత్, రాష్ట్ర మంత్రి దురైమురుగన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం సహా చిత్రపరిశ్రమకు చెందిన పలువురు సినీ ప్రముఖులు పాల్గొని ఇళయరాజాను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రజనీకాంత్ మాట్లాడుతూ... ఓటమిలోనే గెలుపు గొప్పదనం తెలుస్తుందని, దానికి నిదర్శనమే ఈ రాజాధిరాజా ఇళయరాజా అన్నారు. తన కెరియర్‌లో ఎన్నో ఆటుపోట్లకు ఎదురొడ్డి నిలబడ్డారన్నారు. అలాగే, తన వ్యక్తిగత జీవితంలో భార్య జీవ, కుమార్తె భవతారణిని కోల్పోయినా ఆయన చలించలేదు కదా, హార్మోనియం నుంచి సంగీత స్వరాలు ఇప్పటికీ జాలువారుతున్నాయన్నారు. ఇళయరాజా ప్రపంచం మన ప్రపంచం కాదని, ఆయనది సంగీత ప్రపంచమన్నారు. నిజాయితీగా శ్రమిస్తే ఓటమి దరిచేరదని, గెలుపు విజయతీరాలకు చేర్చడంతో పాటు ఎవరికీ అందనంత ఎత్తుకు చేరుస్తుందనేందుకు ఇళయరాజే మంచి ఉదాహరణ అన్నారు. సంగీత ప్రపంచంలోకి ఎంతమంది వచ్చినా ఆయన్ను ఓడించేవారు లేరన్నారు. కమలహాసన్ చిత్రాలకు మాత్రం ఇళయరాజా సంగీతం ప్రత్యేకమన్నారు. నటుడు కమల్ మాట్లాడుతూ... భాష తెలియని వారికి కూడా సంగీతం తెలుస్తుందన్నారు. తాను ఇళయరాజాకు అభిమానిని అయితే, తనకంటే వీరాభిమాని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. డిప్యూటీ సీఎం ఉదయనిధి మాట్లాడుతూ... తాను కూడా బాల్యం నుంచే కోట్లాది మంది తరహాలో ఇళయరాజా పాటలు వింటూ పెరిగానన్నారు.ఆయన ఒక సంగీత దర్శకుడు కంటే ఒక సంగీత వైద్యుడిగా ఉన్నారన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే 'బెస్ట్ స్ట్రెస్ రిలీఫర్' అని ఉదయనిధి పేర్కొన్నారు. సీఎం స్టాలిన్ మాట్లాడుతూ... ఇక యేటా 'ఇళయరాజా' పేరుతో రాష్ట్రప్రభుత్వం అవార్డు ప్రదానం చేస్తుందని వెల్లడించారు. ఈ సందర్భంగా తనకు సన్మానం చేసిన ముఖ్యమంత్రి స్టాలిన్, రాష్ట్ర ప్రభుత్వానికి ఇళయరాజా కృతజ్ఞతలు తెలిపారు.

ఇసైజ్ఞానికి ఘనసన్మానం

కాగా, స్థానిక పెరియమేట్‌లోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో శనివారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమానికి సీనియర్ నటుడు శివకుమార్, సీనియర్ సంగీత దర్శకుడు గంగై అమరన్, ఇళయరాజా కుమారులు, సంగీత దర్శకులు కార్తీక్ రాజా, యువన్ శంకర్ రాజాతో పాటు ఇళయరాజా కుటుంబ సభ్యులు, హీరో కార్తీ, హీరోయిన్ దేవయాని, దర్శకురాలు కృత్తికా ఉదయనిధి, దర్శకుడు, ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి, రాష్ట్ర మంత్రి స్వామినాథన్‌తో సహా తమిళ చిత్రపరిశ్రమకు చెందిన అనేక మంది సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ప్రారంభానికి ముందు ఇళయరాజా సంగీత బృందం ఆధ్వర్యంలో సంగీత విభావరి జరిగింది. ఇందులో ఆలపించిన పాటలను సీఎం ఎంపిక చేయడం గమనార్హం. 'అముదే తమిళే' పాటతో విభావరిని ప్రారంభించారు. పాటను సన్మాన గ్రహీత ఇళయరాజా ఆలపించగా, ఆ తర్వాత హీరో కమల్ హాసన్ స్వరం కలిపారు. ఆ తర్వాత 'రాక్కమ్మా కైయ తట్టు (దళపతి), 'సెంధూరపూవే' (16 వయదునిలే), 'చిన్న తాయ్ అవల్' (దళపతి), 'మడై తిరందు (నిళల్‌గల్) వంటి అనేక పాత చిత్రాల్లోని ఆణిముత్యాల్లాంటి పాటలను ఆలపించారు.



ఇళయరాజా సంఘనీని ఆలపిస్తున్న కళాకారులు - కరతాళ ధ్వనులు చేస్తున్న సీఎం స్టాలిన్ తదితరులు

సమాచార దర్శిని

సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జంతువుల సంరక్షణ, ఆహారం, పునరుత్పత్తి, పాల సేకరణ, పాల ఆధారిత వ్యాపారం, గ్రామీణాభివృద్ధి తదితర కోర్సులు అందిస్తున్నారు. https://candidate.tnskill.tn.gov.in/skillwallet/ course/4377 లో దరఖాస్తు చేసుకోవచ్చు.

30వ తేదీలోపు ఆస్తి పన్ను చెల్లించండి

పెరంబూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన రెండో అర్ధవార్షిక పన్నును ఈ నెల 30వ తేదిలోపు చెల్లించి, ప్రత్యేక వడ్డీ నుంచి మినహాయింపు పొందాలని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పేర్కొంది. కార్పొరేషన్ పన్ను వసూలు కేంద్రాలు, ఈ-సేవా కేంద్రాలు, జీసీసీ వెబ్‌సైట్‌లో కానీ, డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా కూడా పన్ను చెల్లించవచ్చు. అలాగే, 'క్యూ ఆర్ కోడ్' ద్వారా, వాట్సాప్ నెం.9445061913 ద్వారా ఆస్తి పన్ను ఈ నెల 30వ తేది లోపు చెల్లించాలని జీసీసీ పేర్కొంది.

'టెట్'కు 4.80 లక్షల దరఖాస్తులు

పెరంబూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరం ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు 4.80 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం ప్రకారం, 1 నుంచి 8వ తరగతి వరకు పనిచేసే ● సెకండరీ, డిగ్రీ టీచర్లు టెట్‌లో ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. సెకండరీ గ్రేడ్ టీచర్లు టెట్ పేపర్-1, బీఎడ్ పూర్తిచేసిన డిగ్రీ టీచర్లు టెట్ పేపర్-2లో ఉత్తీర్ణులు కావాలి. 2025వ సంవత్సరానికి సంబంధించిన టెట్ నవంబరు 15,16 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ పరీక్ష కోసం దరఖాస్తు స్వీకరణ గత నెల 11వ తేది ప్రారంభమై ఈ నెల 8వ తేదీతో ముగియగా, అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు 10వ తేది సాయంత్రం 5 గంటల వరకు పొడిగించారు. ఇప్పటివరకు 6 సార్లు టెట్ నిర్వహించగా, 2014లో అత్యధికంగా సుమారు 6.40 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఉపాధ్యాయ ఎంపిక బోర్డు (టీఆర్బీ) తెలిపింది.

రేపు అన్నాదురైకు స్టాలిన్ నివాళి

పెరంబూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి అన్నా దురై జయంతి సందర్భంగా డీఎంకే ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నివాళులర్పించనున్నారు. అన్నాదురై 117వ జయంతి సందర్భంగా స్థానిక వళ్లువర్ కోట్టం సమీపంలోని ఆయన విగ్రహానికి ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు స్టాలిన్, ప్రధాన కార్యదర్శి దురైమురుగన్, కోశాధికారి టీఆర్ బాలు తదితరులు నివాళులర్పించనున్నారు. కార్యక్రమంలో పార్టీ అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తలు పాల్గొనాలని డీఎంకే పిలుపునిచ్చింది.

ఆవడి బస్ టెర్మినల్ మార్పు

పెరంబూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొత్త బస్ టెర్మినల్ నిర్మాణ పనులు చేపట్టనున్న కారణంగా ఆవడి బస్టాండ్‌ను మార్చారు. ఎంటీహెచ్ రోడ్డు 100 మీటర్ల దూరంలోని స్థలం నుంచి బస్సుల రాకపోకలు చేపట్టారు. నిర్మాణ పనులు ముగిసే వరకు ఈ బస్టాండ్ నుంచే బస్సులు నడపనున్నట్లు, నెలవారీ బస్‌పాస్‌లు కూడా తాత్కాలిక బస్టాండ్‌లోనే పొందవచ్చని అధికారులు తెలిపారు.

23నుంచి గ్రూప్-2 పోస్టులకు మూడో విడత సర్టిఫికెట్ల పరిశీలన

పెరంబూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2ఏ పోస్టులకు మూడో విడత సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 23న జరుగనున్నట్టు టీఎన్‌పీఎస్సీ కార్యదర్శి గోపాల సుందరరాజ్ పేర్కొన్నారు. గ్రూప్-2ఏ పోస్టుల భర్తీకి నిర్వహించిన రాతపరీక్షలో అభ్యర్థుల మార్కులు, ర్యాంకు తదితరాలను టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో విడుదల చేశామన్నారు. మూడో విడత సర్టిఫికెట్ల పరిశీలన బ్రాడ్‌వే సమీపంలోని టీఎన్‌పీఎస్సీ కార్యాలయంలో జరుగనుంది. మూడవ విడత అభ్యర్థులు జాబితా www.tnpsc.gov.inలో విడుదల చేసినట్లు, కాల్ లెటర్స్‌ను అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి డౌన్ లోడ్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

వేదపారాయణం శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళని మురుగన్ ఆలయంలో నూతనంగా ప్రారంభించిన వేద పారాయణం పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి పార్ట్ టైం విద్యార్థినీ, విద్యార్థుల ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. నాలుగు సంవత్సరాల పార్ట్ టైం శిక్షణ తరగతులు ఉదయం 6 నుంచి 8 గంటలు లేదా రాత్రి 7 నుంచి 9 గంటల వరకు, శని, ఆదివారాల్లో పూర్తికాల తరగతులు నిర్వహించనున్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 14 నుంచి 24 ఏళ్లలోపున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు ప్రోత్సాహక వేతనంగా నెలకు రూ.5,000 అందించనున్నారు. www.vadapalani andavar.hrce.tn.gov.in, www. hrce. tn.gov.in నుంచి దరఖాస్తు డౌన్ లోడ్ చేసుకుని, పూర్తిచేసి తగిన సర్టిఫికెట్లతో 'జాయింట్ కమిషనర్, అరుళ్‌మిగు వడపళని ఆండవర్ తిరుక్కోయిల్, వడపళని, చెన్నై-600026' చిరునామాకు అక్టోబరు 13వ తేదిలోపు పంపించాలని ఆలయ అధికారులు ప్రకటనలో తెలిపారు.

అన్నప్రసాదం ట్రస్టుకు రూ.44 లక్షల విరాళం



తిరుమల, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు శనివారం రూ.44 లక్షలు విరాళంగా అందింది. నవంబరు9న తన పుట్టిన రోజు సందర్భంగా వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ఒకరోజు వితరణకు అయ్యే ఖర్చు రూ.44 లక్షలను తమిళనాడు రాష్ట్ర మంత్రి కెఎన్ నెహ్రూ అందజేశారు. విరాళం డీడీని దాత ప్రతినిధి సురేష్ టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు అందజేశారు.

ఎంజీఆర్ ఫొటోతో రాజకీయాలా?

● విజయ్‌కు అన్నాడీఎంకే నేత సెల్లూరురాజు చురక



సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి సెల్లూరు రాజు

ప్యారీస్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజల ముఖ్యమంత్రిగా గుర్తింపు పొందిన ఎంజీఆర్ ఫొటో చూపించి అన్నాడీఎంకే కార్యకర్తలను తమవైపుకు మళ్లించుకోవాలనుకోవడం జరగని పని అని, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్‌ని ఉద్దేశించి మాజీమంత్రి సెల్లూరురాజు వ్యాఖ్యానించారు. మదురైలో శనివారం అన్నాడీఎంకే జిల్లా నిర్వాహకులతో సమావేశమైన సందర్భంగా సెల్లూరురాజు మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం డీఎంకే ప్రభుత్వంలో మదురైకి చెందిన ఇద్దరు మంత్రులున్నారని, ఈ నాలుగేళ్లలో ఒక్క పథకాన్ని కూడా తీసుకురాలేదని ఆరోపించారు. డీఎంకే అవినీతి గురించి రాష్ట్రప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఎంజీఆర్ అన్నాడీఎంకేను స్థాపించి ప్రజల మద్దతుతో ఏకంగా పదమూడేళ్లు సీఎంగా రాణించి అన్ని వర్గాలకు న్యాయం చేశారన్నారు. మాజీముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి నాయకత్వంలో పార్టీ రోజురోజుకు బలం పుంజుకుంటోందని, ఆయన ఎక్కడికి వెళ్లినా ప్రజలు తండోపతండాలుగా వచ్చి ఆయన ప్రసంగాన్ని శ్రద్ధగా ఆలకిస్తున్నారన్నారు. డిప్యూటీ సీఎం ఉదయనిధికి వేదికలపై ప్రసంగించడం చేత కాదని, ఎవరో రాసిచ్చిన స్క్రిప్టును కూడా తప్పుగా చదువుతున్నారని విమర్శించారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో మదురై ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించానన్నారు. నగరంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు ఫ్లైఓవర్లు నిర్మించామని, వైగై డ్యాం పరిధిలో ఐదు చెక్‌డ్యాంలు నిర్మించి నీరు సముద్రంలో వృథాగా కలువకుండా అధికస్థాయిలో నిల్వవుంచినట్లు సెల్లూరురాజు తెలిపారు.

16న సేలంకు డిప్యూటీ సీఎం ఉదయనిధి

ప్యారీస్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సేలం కరుప్పూర్‌లో ఈనెల 16న నిర్వహించనున్న ప్రభుత్వ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం ఉదయనిధి పాల్గొని మహిళా స్వయం సహాయక బృందాలకు గుర్తింపుకార్డు, బ్యాంకు రుణాలు అందజేస్తారు. సేలం కరుప్పూర్‌లో ఉన్న ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండులో ఉదయం 10 గంటలకు ఉదయనిధి ఈ పథకాన్ని ప్రారంభిస్తారు. అదే విధంగా మిగతా జిల్లాలకు వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా ఈ పథకాన్ని ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో సేలం జిల్లాలకు చెందిన 5వేలకు పైగా మహిళా స్వయం సహాయక బృందాలకు సహాయాలు అందజేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసే కార్యక్రమంలో ఆలయ పాల్గొని పూర్తి చేసిన అభివృద్ధి పథకాల పనులను పరిశీలిస్తారు. ఈ సమావేశంలో తదుపరి చేపట్టాల్సిన పనుల గురించి అధికారులతో ఉదయనిధి చర్చించనున్నారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్రపర్యాటక శాఖ మంత్రి రాజేంద్రన్, సేలం జిల్లా కలెక్టర్ బృందా, ఎంపీలు టీఎం. సెల్వగణపతి, ఎస్.శివలింగం తదితరులు పాల్గొంటారు.

ఇకపై ఆన్‌లైన్‌లో పోస్టుమార్టం నివేదిక!

పెరంబూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శవ పరీక్ష నివేదికను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యం తీసుకువచ్చే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. శవ పరీక్ష నివేదిక ఆధారంగా పోలీసులు దర్యాప్తు వేగవంతం చేస్తారు. గతంలో, నివేదికను ఆస్పత్రి నుంచి పోలీసులు, కోర్టు సీల్డు కవరు రూపంలో స్వీకరించేవి. అయితే, వైద్యుల బదిలీ కారణంగా సంతకాలు పొందడంలో ఇబ్బందులు, పోలీసులు స్వయంగా నివేదిక స్వీకరించడానికి వెళ్లడంలో ఆలస్యం వంటి సమస్యలు జరిగేవి. ఈ విధానం సులభతరం చేయాలని ప్రభుత్వానికి పలువురు విజ్ఞప్తి చేశారు. దీంతో ఆస్పత్రి తరఫున శవ పరీక్ష నివేదికలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే పనులు చేపట్టనున్నారను. కోర్టు, పోలీసులు మాత్రమే ఈ నివేదికలను డౌన్ లోడ్ చేసుకోవడానికి అనుమతించనున్నారు. ఈ విషయమై వైద్య అధికారులు మాట్లాడుతూ... రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రుల్లో ప్రస్తుతం శవ పరీక్షల నివేదికలు ఆన్‌లైన్‌లో అప్ లోడ్ చేసే పని ట్రయల్ రన్ జరుగుతోందన్నారు. శవ పరీక్ష అనంతరం 24 గంటల్లో నివేదిక ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తామన్నారు.

మరుదమలైలో 184 అడుగుల మురుగన్ విగ్రహం

● స్థలాన్ని పరిశీలించిన అధికారులు




విగ్రహం ఏర్పాటు చేయనున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

చెన్నై, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా మరుదమలై సుబ్రహ్మణ్యస్వామి ఆలయం సమీపంలో 184 అడుగుల ఎత్తున మురుగప్పెరుమాన్ విగ్రహం ప్రతిష్ఠించేందుకు ప్రాథమిక స్థాయి పనులు సాగుతున్నాయి. ఈ విగ్రహం ఏర్పాటుకానున్న ప్రాంతం వద్ద ఆలయానికి చెందిన 2.5 ఎకరాల స్థలం మాత్రమే ఉంది. అదనంగా 2.48 ఎకరాలు అవసరమవుతుండటంతో అధికారులు స్థల సేకరణపై దృష్టి సారించారు. శనివారం ఉదయం స్థలసేకరణ విషయమై కోయంబత్తూరు జిల్లా హిందూ దేవాదాయ శాఖ అధికారి సురేష్ నాయకత్వంలో అధికారులు విగ్రహం ఏర్పాటు ప్రాంతాన్ని తనిఖీ చేశారు. విగ్రహం ఏర్పాటు పనులపై ఈ నెల 22న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమీక్షా సమావేశం జరగనుందని తెలిపారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ సెంథిల్‌కుమార్, తక్కర్ జయకుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా దిగువ తెలిపిన ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ బోర్డు తెలిపింది. **రెడ్‌హిల్స్:** సోత్తుపెరుంబేడు, కిర్లాపురం, పుదూర్, ఆరుమంద్రై, విచూర్, మేట్టుపాళయం, కండిగై, వెల్లివాయల్. **సెంబియం:** కట్టబొమ్మన్ మెయిన్ రోడ్డు, జంబులి వీధి, మాధవరం హైరోడ్డు, వెంకటేశ్వర కాలనీ 1 నుంచి 10 వీధులు, మూలకడై, ఆర్వీ నగర్, అన్నా సత్యా నగర్, అరుళ్ నగర్ మెయిన్ రోడ్డు, సీతారామన్ నగర్, ఎంఆర్ఎల్ కాలని, కామరాజర్ రోడ్డు, సింప్సన్ గ్రూప్, పెరియార్ నగర్.

లోక్ అదాలత్‌లో 5,149 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్‌లో న్యాయవాదులు, అధికారులు

వేలూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలకు ఒకసారి నిర్వహించే లోక్ అదాలత్‌లో జిల్లావ్యాప్తంగా పలు విభాగాలకు సంబంధించిన కేసులను పరిష్కరిస్తుంటారు. ఈ క్రమంలో శనివారం ఉదయం నిర్వహించిన లోక్ అదాలత్‌లో జిల్లా న్యాయమూర్తి ఇళవరసన్ ముందుకు 5,149 కేసులు పరిష్కారానికి రాగా, వాటిలో రెండు కేసుల్లో బాధితులకు రూ.45లక్షల పరిహారాన్ని అందించాలని న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు. అనంతరం మొత్తం 5,147 కేసులను న్యాయమూర్తి పరిష్కరించారు.

సినీ హీరోలను చూసేందుకు జనం పెద్దసంఖ్యలో వస్తుంటారు

● బీజేపీ రాష్ట్ర చీఫ్ నయినార్



మీడియాతో మాట్లాడుతున్న నయినార్ నాగేంద్రన్ తదితరులు

ప్యారీస్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొత్తగా పార్టీ పెట్టిన విజయ్ సినీ హీరో కావడం వల్ల ఆయన్ను చూసేందుకు జనం పెద్దసంఖ్యలో వస్తున్నారే కానీ, ఓటేసి గెలిపించేందుకు కాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ పేర్కొన్నారు. అమింజికరైలో బీజేపీ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ప్రారంభించిన సందర్భంగా నయినార్ మీడియాతో మాట్లాడారు. సహజంగా సినీ హీరోలను చూసేందుకు అభిమానులతో పాటు ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో వస్తుంటారని కానీ, వారందరూ ఓటు వేస్తారా? అనే విషయాన్ని విజయ్ గమనించాలన్నారు. అవినీతిని ప్రోత్సహిస్తున్న డీఎంకే ప్రభుత్వాన్ని గద్దెదింపాలన్న లక్ష్యంతోనే విజయ్ ప్రచారం సాగిస్తున్నారన్నారు. లాభాపేక్ష లేకుండా రాష్ట్రానికి అంకితభావంతో సేవలందించే పార్టీకే ప్రజలు పట్టంకడతారన్నారు. అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత తమ కూటమి మరింత బలపడే అవకాశముందన్నారు. అదేవిధంగా వరుసగా రెండుసార్లు ప్రభుత్వం ఏర్పాటు చేసిన చరిత్ర డీఎంకేకు లేదని, ఒక్క అన్నాడీఎంకే మాత్రమే ఈ రికార్డు సృష్టించ గలిగిందని నయినార్ అన్నారు.

రిటైర్డ్ సీఐ తోటలో ఆరడుగుల పొడవుతో

విరగ కాసిన మునగకాడలు



సీఐ కన్నదాసన్ పెరటితోటలో మునగచెట్టు నుండి ఆరు అడుగుల పొడవునా వేలాడుతున్న మునగకాడలు

చెన్నై, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లాలో సురుళిపట్టిరోడ్డులో నివసిస్తున్న రిటైర్డ్ సీఐ కన్నదాసన్ ఇంటిచుట్టూ పెంచుతున్న తోటలో మునగచెట్టుకు ఆరు అడుగుల పొడవున మునగకాడలు కాశాయి. ఎరువులు, క్రిమిసంహారక మందులు ఉపయోగించకుండా సహజసిద్ధమైన ఎరువులతో వంగ, మునగ, అత్తిచెట్లు పెంచారు. కొద్ది నెలలకు ముందు అతడి స్నేహితుడొకరు కొత్త వంగడానికి చెందిన మునగచెట్లను కానుకగా ఇచ్చాడు. ఆ మునగ చెట్లను తన ఇంటి వెనుక తోటలో పెంచాడు. ఏపుగా పెరిగిన ఆ మునగచెట్టు నుంచి ఐదు/ఆరు అడుగుల పొడవున మునగ కాడలు విరగ కాశాయి. ఆ పొడవైన మునక్కాయలను స్థానికులు వింతగా చూస్తున్నారు. ఈ విషయమై ఉద్యానవనాల శాఖ అధికారి మాట్లాడుతూ కన్నదాసన్ పెంచిన మునగ చెట్టు అంటుకట్టిన రకానికి చెందినదై ఉంటుందని తెలిపారు.

ఎయిర్ ఇండియా విమానాల రాకపోకల్లో జాప్యం

● ప్రయాణికుల ఇబ్బందులు

పెరంబూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరం నుంచి ఎయిర్ ఇండియా రాకపోకల్లో జాప్యం జరగడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మీనంబాక్కం విమానాశ్రయం నుంచి కొలంబోకు శుక్రవారం అర్ధరాత్రి 12.55 గంటలకు బయల్దేరాల్సిన ఎయిర్ ఇండియా విమానం గంటన్నర ఆలస్యంగా శనివారం వేకువజామున 2.25 గంటలకు బయల్దేరి వెళ్లింది. ఇక, నగరం నుంచి సింగపూర్‌కు శనివారం ఉదయం 5.40 గంటలకు బయల్దేరాల్సిన ఎయిర్ ఇండియా విమానం 3గంటలు ఆలస్యంగా ఉదయం 8.40 గంటలు బయల్దేరింది. అలాగే, శుక్రవారం రాత్రి 10.10 గంటలకు హైదరాబాద్ వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానం 2గంటలు ఆలస్యంగా అర్ధరాత్రి 12.10 గంటలకు బయల్దేరింది. విమానాల ఆలస్యంపై ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో అధికారులతో ప్రయాణికులు వాగ్వాదానికి దిగారు.

మొబైల్ ఫోన్ల అప్పగింత



మహిళకు మొబైల్‌ఫోన్‌ను అందజేస్తున్న ఎస్పీ

వేలూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో చోరీకి గురైన మొబైల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు శనివారం ఉదయం వేలూరు ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వాటిని ప్రజలకు అందజేశారు. ఎస్పీ మయిల్‌వాహనం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత మూడేళ్లుగా జిల్లావ్యాప్తంగా జరిగిన మొబైల్ చోరీ కేసులపై విచారణ చేపట్టి సుమారు రూ.3.38కోట్ల విలువైన 1,754 మొబైల్ ఫోన్లను యజమానులకు అప్పగించామన్నారు.

రీడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ కార్యక్రమంలో నిర్వాహకులు

వేలూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వేలూరు కవి లక్ష్మీపతి కృపానందస్వామి జీవితాధారంగా రాసిన 'నదీక్కరై ఇల్వరుకలంగరై విలక్కమ్' అనే పుస్తకాన్ని శనివారం ఉదయం రీడర్స్ అసోసియేషన్ నిర్వాహకులు ఆవిష్కరించారు. వేలూరు ఉపాధ్యాయుల హోమ్స్‌లో అసోసియేషన్ అధ్యక్షుడు రవి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కవి లక్ష్మీపతి కృపానంద... మురుగన్‌కు గొప్ప భక్తుడని, సమాజాన్ని ప్రేరేపించే విధమైన సరళిలో ఆయన రచనలుండేవని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ గవర్నర్ సురేష్, ప్రముఖ కవులు మోహన్, జోసఫ్, రంజన్, టెక్నికల్ విభాగ ఉపాధ్యాయులు జనార్ధనన్, కుమారి, కుమరన్, శ్రీనివాసన్, శక్తివేలన్, కామరాజన్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే నరసింహన్ కారుపై దాడి

● ఒకరి అరెస్ట్



తిరుత్తణి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అమ్మవారి ఉత్సవాలకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే నరసింహన్‌పై అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే)కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. శుక్రవారం రాత్రి తిరువళ్లూరు జిల్లా అతిమాంజేరిపేట మారియమ్మన్ ఆలయ జాతరకు వెళ్లిన అన్నాడీఎంకే మాజీ ఎమ్మెల్యే నరసింహన్‌పై అక్కడే ఉన్న ఏఎంఎంకే కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. దీంతో నరసింహన్ వేరే కారులో అక్కడినుంచి వెళ్లిపోయారు. ఈ ఘటనలో కారు ధ్వంసమైంది. దీనితో ఆ ప్రాంతంలో గందరగోళం నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. అనంతరం దీనిపై కేసు నమోదు చేసి జరిపిన విచారణలో దాడికి పాల్పడిన వారిలో ఒకరిని గుర్తించి అదుపులోకి తీసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నేడు కృష్ణగిరికి సీఎం స్టాలిన్

పెరంబూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరిలో ఆదివారం సీఎం స్టాలిన్ సుమారు రూ.2 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. చెన్నై నుంచి ఆదివారం ఉదయం 9.30 గంటకు విమానం ద్వారా కృష్ణగిరి జిల్లా హోసూరు తనేజా విమానదళంలో దిగనున్నారు. అక్కడి నుంచి కారులో కృష్ణగిరి వెళ్లనున్నారు. రాయకోట ఫ్లై ఓవర్ నుంచి అన్నా విగ్రహం, బెంగళూరు రోడ్డు, ఐదు రోడ్ల రౌండ్ ఠానా, చెన్నై బైపాస్ రోడ్డు ప్రాంతాల్లో సీఎం రోడ్ షోలో పాల్గొననున్నారు. అనంతరం కృష్ణగిరి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో జరిగే కార్యక్రమంలో పాల్గొననున్నారు. అలాగే, పలు శాఖల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు సంక్షేమ సహాయాలు అందజేయనున్నారు.

టీసీ కోసం లంచం : హెచ్‌ఎం అరెస్ట్

పెరంబూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థికి ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్ (టీసీ) అందించేందుకు లంచం అడిగిన ప్రధానోపాధ్యాయుడిని అవినీతి నిరోధక శాఖ పోలీసులు అరెస్ట్ చేశారు. నామక్కల్ జిల్లా కుమరపాళయం కలియనూరుకి చెందిన జ్యోతిష్కుడు జయవేల్ (45) టీసీ కోసం తాను చదివిన కండిపుదూర్ పంచాయతీ యూనియన్ మాధ్యమిక పాఠశాల హెచ్‌ఎం విజయకుమార్‌ను సంప్రదించాడు. రూ.5,000 ఇవ్వాలని హెచ్‌ఎం కోరడంతో అవినీతి నిరోధక శాఖ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికారుల సూచనలతో రసాయనం పూసిన కరెన్సీ నోట్లను జయవేల్ హెచ్‌ఎం అందజేస్తుండగా, అక్కడే మాటువేసి పోలీసులు అతన్ని రెడ్‌హ్యాండెడ్ పట్టుకుని విచారిస్తున్నారు.

మహిళా బైక్ రైడర్‌కు లైంగిక వేధింపులు

విద్యార్థి అరెస్ట్

పెరంబూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహిళను లైంగిక వేధింపులకు గురిచేసిన విద్యార్థిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఓట్టేరికి చెందిన 31 ఏళ్ల మహిళ 'బైక్ టాక్సీ' డ్రైవర్‌గా పనిచేస్తోంది. రాయపేటలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతున్న అమింజికరైకు చెందిన యువకుడు (19) సెల్‌ఫోన్ యాప్ ద్వారా కోయంబేడు నుంచి అరుంబాక్కం ఎంఎండీఏకు వెళ్లేందుకు బైక్ బుక్ చేసుకున్నాడు. అతన్ని మహిళా బైక్ రైడర్ తన ద్విచక్రవాహనంలో తీసుకెళ్లింది. మార్గ మధ్యంలో ఇమ్రాన్, మొబైల్‌ఫోన్‌లో తన స్నేహితుడితో మాట్లాడినట్లు అసభ్యంగా మాట్లాడుతూ... ఆమెను లైంగిక వేధించాడు. ఈ వ్యవహారంపై బాధిత మహిళ ఫిర్యాదుతో అరుంబాక్కం పోలీసులు కేసు నమోదుచేసి యువకుడిని అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి



పెరంబూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బస్సు, సరుకుల వ్యాన్ ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతి చెందారు. తిరువణ్ణామలై జిల్లా సెంగం సమీపం మన్‌మలై ప్రాంతంలో పూల బస్తాలు తీసుకెళ్తున్న వ్యాన్‌ను ప్రభుత్వ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో వ్యాన్ ముందు భాగం నుజ్జునుజ్జుకాగా, వ్యాన్ డ్రైవర్ మణి తీవ్రగాయాలతో ఘటన స్థలంలోనే మృతిచెందాడు. సమాచారం అందుకొని అక్కడకు చేరుకున్న పోలీసులు, గాయపడిన వ్యానులో ప్రయాణిస్తున్న ఆర్ముగం, అశోక్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్సలు ఫలించక ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పళని ఆలయానికి సొంతమైన రూ.100 కోట్ల విలువైన స్థలం స్వాధీనం

పెరంబూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పళని మురుగన్ ఆలయ పరిధిలో ఉన్న దండపాణి స్వామి మఠానికి సొంతమైన రూ.100 కోట్ల స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. దిండుగల్ జిల్లా పళని మురుగన్ ఆలయ దండపాణి స్వామి మఠానికి సొంతమైన 1.40 ఎకరాల స్థలం పళని ఆండవన్ పార్క్ రోడ్డు-సన్నిధి వీధిని కలిపే ప్రాంతంగా ఉంది. ప్రస్తుతం ఆ ప్రాంతం పొదలు, ముళ్లచెట్లతో కూడుకుని ఉంది. ఈ వ్యవహారంపై దాఖలైన పిటిషన్ విచారించిన పళని మేజిస్ట్రేట్ కోర్టు, స్థలం స్వాధీనం చేసుకోవాలని ఉత్తర్వులు జారీచేసింది. కోర్టు ఉత్తర్వులతో ఆలయ జాయింట్ కమిషనర్ మారిముత్తు నేతృత్వంలో సిబ్బంది, పారిశుధ్య కార్మికులు స్థలంలోని ముళ్ల చెట్లు, పొదలు తొలగించి స్వాధీనం చేసుకున్నారు. 60 ఏళ్ల అనంతరం ఈ స్థలం స్వాధీనం చేసుకున్నట్లు ఆలయ జాయింట్ కమిషనర్ తెలిపారు.

పత్తిమిల్లులో అగ్నిప్రమాదం

ప్యారీస్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా పిల్లయార్‌నత్తంలో ఉన్న ఓ ప్రైవేటు పత్తిమిల్లులో శుక్రవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో రూ. లక్షలు విలువ చేసే పత్తి బండళ్లు మంటల్లో బూడిదయ్యాయి. ఈ మిల్లులో సుమారు 30 మందికి పైగా పనిచేస్తున్నారు. రోజూలాగే శుక్రవారం సాయంత్రం 7గంటలకు వరకు విధులు ముగించుకుని ఉద్యోగులంతా ఇళ్లకు వెళ్లిపోయారు. రాత్రి సుమారు 10 గంటల సమయంలో ఆ పత్తిమిల్లు నుంచి మంటలు రావడాన్ని గుర్తించిన స్థానికులు దిండుగల్ అగ్నిమాపకశాఖ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. రెండు ఫైరింజన్లతో చేరుకున్న సిబ్బంది సుమారు గంటసేపు పోరాడి మంటలను అదుపుచేశారు. షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం జరినట్లు పోలీసులు నిర్ధారించారు.

నకిలీ రిజిస్ట్రేషన్ బస్సు స్వాధీనం



వేలూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సరిహద్దులు కలిగిన వేలూరు జిల్లాలో అనధికారిక నెంబర్‌ప్లేట్లతో వాహనాలు నడుపుతున్నట్లుగా అందిన ఫిర్యాదుతో పోలీసులు నిఘా పెంచారు. ఈ నేపథ్యంలో, ఆర్టీవో సునీల్ నేతృత్వంలోని బృందం సభ్యులు శుక్రవారం రాత్రి కాట్పాడి సమీపంలోని క్రిస్టియన్‌పేటలో వాహన తనిఖీలు చేపట్టారు. తిరుపతి నుంచి వేలూరుకు వెళుతున్న ఓ ప్రైవేటు బస్సుకు నకిలీ నెంబర్ ప్లేట్ ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ఆ బస్సు ఆంధ్రప్రదేశ్ విజయవాడకు చెందిన ఓ వ్యక్తిదిగా తెలిసింది. ఈ కేవీఆర్ ట్రావెల్స్ పేరుతో ఉన్న ఈ బస్సును తిరుపతి నుంచి తిరువణ్ణామలై వరకు నడుపుతున్నట్లు డ్రైవర్ తెలిపాడు. స్వాధీనం చేసుకున్న బస్సును వేలూరు కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణానికి తరలించారు.

● కోర్టు ఉత్తర్వుల ధిక్కరణ కేసులో

ఎంపీ నవాజ్ గనికి నోటీసులు

పెరంబూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు వక్ఫ్ బోర్డు ఛైర్మన్, రామనాథపురం ఎంపీ నవాజ్ గనీపై కోర్టు ధిక్కరణ కేసు నమోదైంది. మసీదు నిధులు దుర్వినియోగం చేశారని, ఈ వ్యవహారంపై వక్ఫ్ బోర్డు సూపరింటెండెంట్ దర్యాప్తు నిర్వహించాలని వాలాజాపేటకు చెందిన న్యాయవాది ఫయాజ్ అహ్మద్ పిటిషన్‌లో కోరారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని గత ఫిబ్రవరిలో హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.ఈ క్రమంలో, నవాజ్ గని కోర్టు ఉత్తర్వులు అమలు చేయలేదని ఆరోపిస్తూ కోర్టు ఉత్తర్వుల ధిక్కరణ కేసు నమోదైంది. ఈ కేసులో, ఎంపీ నవాజ్ గనీ ఈ నెల 19వ తేదిలోపు అఫిడవిట్ దాఖలు చేయాలని మద్రాసు హైకోర్టు నోటీసు జారీ చేసింది.

బాధితులకు సహాయాల పంపిణీ



తిరుత్తణి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి మున్సిపాలిటీలోని నెహ్రూ నగర్‌లో నివాసం ఉంటున్న రాసు తేవర్ (70)అనే వృద్ధుడి ఇల్లు శుక్రవారం రాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రాసు తేవర్‌కు తీవ్రగాయాలతో బయటపడ్డాడు. సుమారు రూ.2లక్షల విలువైన వస్తువులు మంటల్లో కాలి బూడిదయ్యాయి. ఈ నేపథ్యంలో వృద్ధుడికి ఆర్డీవో మలర్విళి నేతృత్వంలో శనివారం ఉదయం అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని కిరాణా సామగ్రి, రూ.5వేల నగదు అందజేశారు.

SUNDAY SPECIAL

మహాబలిపురం సాగరగర్భంలో ప్రాచీన ఆలయాలు?


సబ్‌మెర్సిబుల్ రోబోటిక్ వాహనంతో పరిశోధనలు జరుపుతున్న పురావస్తుశాఖ పరిశోధకులు


సముద్రతీరం వెనుక కట్టడ అవశేషాలు బయల్పడిన ప్రాంతం


ఇటీవల బయల్పడిన ఇటుకలతో నిర్మించిన కుడ్యాలు


మహాబలిపురం సముద్రతీర దేవాలయం

కడలిలో చెక్కుచెదరని కట్టడాలు

రోబోటిక్ వాహనంతో సాగుతున్న పరిశోధనలు

ఆరు ఆలయాల వివరాలు వెల్లడించనున్న అన్వేషకులు

చెన్నై, ఆంధ్రజ్యోతి

ఏడో శతాబ్దంలో కాంచీపురం నగరాన్ని రాజధానిగా చేసుకుని పరిపాలించిన పల్లవ రాజుల ఓడరేవు పట్టణం మహాబలిపురం. చెంగల్పట్టు జిల్లాలోని ఈ ప్రాంతం అద్భుతమైన ప్రాచీన శిల్పకళలకు నిలయం.యునెస్కో ప్రపంచ ప్రాచీన వారసత్వ పర్యాటక ప్రాంతంగా పేరుగడించింది. ప్రాచీన శిల్పకళా నైపుణ్యాలను చాటే పాండవుల పంచరథాలు, శ్రీకృష్ణుడి వెన్నముద్ద రాయి, అర్జున తపస్సు ప్రాంతం పర్యాటకులను అబ్బురపరుస్తున్నాయి.వీటనింటికీ మించి అక్కడి సముద్రతీర ఆలయం పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణగా ఉంటోంది. ఆ ఆలయంలో మహాశివుడికి, మహా విష్ణువుకు ప్రత్యేక సన్నిధులున్నాయి. ఆ ఆలయానికి తూర్పు దిశగా మరో ఆరు సముద్రతీర ఆలయాలు ఉండేవని,అవన్నీ కడలి గర్భంలో కలిసిపోయాయని చరిత్రకారులు చెబుతున్నారు. సముద్రంలో ఆటుపోటుల మార్పుల కారణంగా సముద్రమట్టం తగ్గిన సమయాల్లో కడలి నడుమ రాళ్లలాంటి నిర్మాణాలు కనిపిస్తున్నాయి. కడలిలో మునిగిన ఆ ఆరు దేవాలయాలకు సంబంధించిన ఆధారాలను సేకరించే విషయమై భారతీయ పురావస్తు పరిశోధనశాఖ ఇదివరకే జరిపిన పరిశోధన జరిపింది. సముద్రం అడుగున కొన్ని నిర్మాణాలు ఉన్నట్లు నిర్ధారించింది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం మళ్లీ సముద్రగర్భంలో పరిశోధనలు ప్రారంభమయ్యాయి. ఆగస్టులో సముద్రం అడుగుభాగాన పరిశోధనలను జరిపేందుకు రిమోట్ ద్వారా పని చేసే వాహనాన్ని ఉపయోగించారు. ఈ పరిశోధనలలో వెల్లడైన తాజా విషయాలేమిటి? వీటిపై భారతీయ పురావస్తు శాఖ అధికారులు చెబుతున్నదేమిటి?


సముద్రం అడుగున కనిపిస్తున్న కట్టడ వ్యర్థాలు


అలల కోతకు గురై సముద్రం అడుగున చొచ్చుకుపోయిన కట్టడాలు



సముద్రగర్భంలో రోబోటిక్ కెమెరాతో వీడియో

ఏడు ఆలయాలు ఉండేవా?

రాజధాని నగరం చెన్నై నుంచి సుమారు 60కి.మీ. దూరంలో మహాబలిపురం సముద్రతీరంలో ఉన్న దేవాలయమే తమిళనాట నిర్మించిన మొట్టమొదటి సముద్రతీర దేవాలయంగా చరిత్రకారులు చెబుతున్నారు. ఎనిమిదో శతాబ్దంలో రెండో నరసింహవర్మ ముప్పావు శాతానికి పైగా ఈ ఆలయాన్ని నిర్మించారని చెబుతున్నారు. అక్కడ ఏడు సముద్రతీర దేవాలయాలు ఉండేవని, వాటిలో ప్రస్తుతమున్న దేవాలయం తప్ప తక్కిన ఆరు అందమైన దేవాలయాలు కడలిలో మునిగిపోయాయని భావిస్తున్నారు. సముద్రతీర దేవాలయం ఉన్న ప్రాంతం వద్ద అమావాస్య, పౌర్ణమి రోజుల్లో సముద్రతీరం వెనక్కి మళ్లినప్పుడు ప్రాచీన కట్టడాలకు సంబంధించిన శిలలు, రాళ్లు బయల్పడుతుండటంతో అవన్నీ కడలి గర్భంలో మునిగిన ఆలయాలకు చెందినవేనని స్థానికులు నమ్ముతున్నారు. పదహారో శతాబ్దం నుంచే యూరోపియన్ల రికార్డుల్లో మహాబలిపురం ప్రస్తావనలు ఉన్నాయి. ఆ ప్రాంతంలో ఏడు ఆలయాలు ఉండేవని చాటేలా ఆ రికార్డులలో ఆంగ్లంలో 'సెవెన్ పగోడాస్' పేర్కొన్నారు. 1772లో మహాబలిపురం ప్రాంతంలో పర్యటించిన విలియం చేంబర్స్ ఈ విషయమై కోల్‌కాతా నుంచి వెలువడే 'ఏసియాటిక్ రిసెర్చ్' పత్రికలో ఇలా పేర్కొన్నారు "మహాబలిపురంలో ఏడు ఆలయాలు ఉండేవని చెబుతున్నా, ఆ ఆలయాలు ఏవీ అనే విషయంలో స్పష్టత లేదని, కొందరు ఒకేరాతితో చేసిన రథాలు, సముద్రతీర దేవాలయాన్ని కలిపి ఏడు ఆలయాలుగా భావిస్తున్నారు. మరికొందరు సముద్రతీరంలోనే ఏడు దేవాలయాలు ఉండేవని, ఆరు ఆలయాలు సముద్రగర్భంలో మునిగిపోవటమో లేక కొట్టుకు పోయుంటాయని భావిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ ఎన్నో శతాబ్దాలు గడచినా, కడలిలో కొన్ని ప్రాచీన కట్టడాలు, ప్రత్యేకించి ప్రస్తుతమున్న సముద్రతీర దేవాలయం వంటి ఆలయాలు మునిగిపోయాయనే అనుమానం ఇంకా కొనసాగుతూనే ఉంది."

1990లో ప్రారంభమైన అన్వేషణ...

ఈ నేపథ్యంలోనే భారతీయ పురావస్తు పరిశోధన శాఖ మహాబలిపురం సముద్రతీర ఆలయం చుట్టూ సముద్రగర్భంలో పరిశోధనలకు శ్రీకారం చుట్టింది. 1990-91లో ఆ శాఖ చెన్నై విభాగం అధికారులు మహాబలిపురం సముద్రతీరంలో జరిపిన పరిశోధనల్లో ఏకరాతితో తయారైన వరాహమూర్తి శిల్పం, బావి, పల్లవుల కాలానికి చెందిన కొన్ని శిలాశాసనాలు, కాలినడక మెట్లలాంటి నిర్మాణం బయల్పడ్డాయి. 1998 నుంచి 2000 వరకు జరిపిన పరిశోధనలలో ఆ మెట్లలాంటి నిర్మాణం సముద్రతీరం పొడవునా కొనసాగుతున్న విధంగా ఉన్నట్లు నిర్ధారించారు. ప్రస్తుతమున్న సముద్రతీర దేవాలయానికి పడమటి దిశగా ఇటుకలతో నిర్మించిన కట్టడం బయల్పడటంతో 1995లో భారతీయ పురావస్తు శాఖ, భారత భౌగోళిక పరిశోధన సంస్థ సంయుక్తంగా సముద్ర గర్భంలో పరిశోధనలు జరపాలని నిర్ణయించాయి. 2001 నవంబర్‌లో మహాబలిపురాన్ని ఆనుకుని ఉన్న సముద్ర ప్రాంతంలో సబ్‌మెర్సిబుల్ పరిశోధనలు నిర్వహించారు. అదే విధంగా భూభాగం లోనూ పరిశోధనలు జరిపారు. ఆ తర్వాత 2002 మార్చిలో మళ్లీ పరిశోధనలు. జరిగాయి. ఈ సారి సముద్రతీర దేవాలయానికి ఉత్తరదిశగా ఉన్న, సముద్రం కాస్త లోపలికి చొచ్చుకుని ఉన్న ప్రాంతంలో పరిశోధనలు నిర్వహించారు. మరొక ప్రాంతంలో జరిపిన పరిశోధనలలో కట్టడం కోసం చెక్కిన రాళ్లు లభించాయి. ఆ రాళ్లు ప్రాచీన శిల్పకళను చాటి చెప్పేరీతిలో ఉన్నాయి. అవన్నీ పల్లవుల కాలం నాటివని పరిశోధనల ద్వారా నిర్ధారించారు.ఆ తర్వాత2004 ఫిబ్రవరిలో భారత నావికాదళం సాయంతో మళ్లీ పరిశోధనలు జరిగాయి. ఆ పరిశోధనలలో సముద్రతీరం సమీపాన పలు కట్టడాల అవశేషాలు, రాళ్లు లభించాయి. ఇవన్నీ ఆ ప్రాంతంలో ప్రాచీన భారతీయ శిల్పకళలతో కూడిన ఏదో ఒక నిర్మాణం ఉండేదని,కడలి తీరం నైసర్గిక పరిస్థితులలో ఏర్పడిన మార్పుల వల్ల ఆ కట్టడం నీట మునిగిందని స్పష్టం చేస్తున్నాయి.



తాజా పరిశోధనలు..


భారత పురావస్తు పరిశోధనశాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ అలోక్ త్రిపాఠి

ఈ పరిస్థితులలోనే మళ్లీ ఆ ప్రాంతం వద్ద గత ఆగస్టు 14, 15 తేదీల్లో భారతీయ పురావస్తు పరిశోధన శాఖ ఉన్నతాధికారులు తాజా పరిశోధనలు జరిపారు. ఈ విషయమై ఆ శాఖకు చెందిన సీనియర్ అధికారి మాట్లాడుతూ... ఇప్పటి వరకు జరిగిన పలు పరిశోధనల్లో కొన్ని కట్టడాలు బయల్పడ్డాయన్నారు. ప్రస్తుతం వాటి పరిస్థితి ఎలా ఉందో పరిశీలించడానికి మళ్లీ పరిశోధనలు చేపట్టామన్నారు., ఇప్పటి దాకా గజ ఈతగాళ్లు, స్కూబీడైవర్లను సముద్రగర్భంలోకి పంపి పరిశోధనలు చేశామన్నారు. ప్రస్తుతం శక్తివంతమైన చేప ఆకారం కలిగిన రోబోటిక్ కెమెరాలు అమర్చిన రిమోట్ ద్వారా పనిచేసే ప్రత్యేక వాహనం (రిమోట్లీ ఆపరేటింగ్ వెహికల్) ఉపయోగించి పరిశోధనలు జరిపామన్నారు. తాజాగా రెండు దశాబ్దాలకు ముందు తమ శాఖ పరిశోధనలలో వెలుగులోకి వచ్చిన నిర్మాణాలు, రాళ్లు చెక్కుచెదరకుండా ఉన్నట్లు తేలిందని చెప్పారు. మెట్ల నిర్మాణం కనిపించిందని, రాతితో చేసిన మరికొన్ని భాగాలు స్పష్టంగా కనిపించాయని తెలిపారు. ఇవన్నీ సముద్రతీరం నుంచి 2 కిలోమీటర్ల దూరంలోనే కనుగొన్నామని ఆయన పేర్కొన్నారు. తాజా పరిశోధనలకు నాయకత్వం వహించిన భారత పురావస్తు పరిశోధన శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ అలోక్ త్రిపాఠి మాట్లాడుతూ... 2005లో జరిపిన పరిశోధనల కొనసాగింపుగానే తాజా పరిశోధనలు జరిగాయన్నారు. రెండు రోజులు మాత్రమే ఈ పరిశోధనలు జరిపామన్నారు. సముద్రంలో మార్పుల వల్ల ఇంతకు మునుపు నీటి దిగువ కనిపించిన నిర్మాణాలు ప్రస్తుతం భూమిలోపలకు వెళ్లటం, అదే సమయంలో భూగర్భంలో కూరుకుపోయిన కొన్ని నిర్మాణాలు బయటకు వచ్చాయన్నారు. త్వరలో మరింత శక్తివంతమైన కెమెరాలతో రోబోటిక్ పరికరాలతో శాటిలైట్ సాయంతో అక్కడి సముద్రగర్భంలో మునిగిన ప్రాచీన ఆలయాల విశేషాలను వెలుగులోకి తీసుకొస్తామని తెలిపారు.

పార్టీ విచ్ఛిన్నం కాకుండా చూసుకోండి

● ఈపీఎస్‌కు ఎంపీ కనిమొళి సలహా


డీఎంకే ఎంపీ కనిమొళి

పెరంబూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): డీఎంకే కూటమి గురించి మాట్లాడే ముందు పళనిస్వామి ఆయన పార్టీ విచ్ఛిన్నం కాకుండా చూసుకోవాలని ఎంపీ కనిమొళి సలహా ఇచ్చారు. తూత్తుకుడిలో శనివారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న కనిమొళి మాట్లాడుతూ... కొత్త ఉపరాష్ట్రపతికి ఇప్పటికే శుభాకాంక్షలు తెలిపామన్నారు. ఆయన తటస్థంగా వ్యవహరించాలని ఆశిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్య సంరక్షకుడిగా, ముఖ్యంగా తమిళనాడు హక్కులను పరిరక్షించే బృహత్తర బాధ్యత ఆయనపై ఉందన్నారు. మణిపూర్‌లో 2027లో ఎన్నికలు జరుగుతున్నాయని, ఆ కారణంగానే ప్రధాన మంత్రి ఆ రాష్ట్రానికి వెళ్లారన్నారు. పార్లమెంటు సమావేశాల్లో పలుమార్లు మణిపూర్ హింసాకాండపై చర్చించినా, ఆ రాష్ట్రంలో ప్రధాని పర్యటించి శాంతి నెలకొల్పేలా చర్యలు చేపట్టాలని కోరినా ప్రధాని మోదీ నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. కానీ, ఆ రాష్ట్రానికి ఎన్నికలు రానున్న నేపథ్యంలో, ప్రస్తుతం పర్యటిస్తున్నారన్నారు. 2026లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల ప్రచారం త్వరలో ప్రారంభిస్తానని కనిమొళి తెలిపారు.

సీపీఐ రాష్ట్రకార్యదర్శిగా వీరపాండ్యన్



ప్యారీస్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) రాష్ట్ర నూతన కార్యదర్శిగా ఎం.వీరపాండ్యన్ ఎంపికయ్యారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా సీనియర్ నేత ముత్తరసన్ మూడు సార్లు కొనసాగారు. పార్టీ అజెండా మేరకు మూడేళ్ల అనంతరం కొత్త కార్యదర్శి ఎంపిక కోసం శనివారం స్థానిక చూలైమేడులో సీపీఐ రాష్ట్రస్థాయి నిర్వాహకుల సమావేశం ముత్తరసన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్నికల్లో ఉపప్రధాన కార్యదర్శిగా ఉన్న వీరపాండ్యన్ నూతన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. సీపీఐ రాష్ట్ర పగ్గాలు చేపట్టిన వీరపాండ్యన్‌కు సీఎం స్టాలిన్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం, డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై తదితర నేతలు శుభాకాంక్షలు తెలిపారు. బడుగు బలహీన వర్గాల ఉన్నతికోసం పాటుపడుతున్న వామపక్ష రాజకీయాల్లో పయనిస్తూ మరిన్ని విజయాలు సాధించాలని, వీరపాండ్యన్ నేతృత్వంలో పార్టీ మరింత బలపడాలని ఆ పార్టీ నేతలు కాంక్షిస్తూ వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు.

జాతీయ సముద్ర సాహస క్రీడా పోటీలు ప్రారంభం

● తూత్తుకుడిలో సందడి

ప్యారీస్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడిలో ప్రారంభించిన జాతీయ సముద్ర సాహస క్రీడా పోటీల్లో పలు రాష్ట్రాల నుండి సుమారు 200 మందికి పైగా క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తమిళనాడు పర్యాటకశాఖ, ఆక్వా అవుట్ బెగ్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో తూత్తుకుడి ముత్తునగర్ సముద్రంలో సాహస క్రీడా పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. క్రీడాకారులు పడవల్లో నిలబడి విన్యాసాలు ప్రదర్శించారు. కైట్ సర్ఫింగ్, బీచ్ వాలీబాల్, మారథాన్, ఫైర్ వారియర్ తదితర పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రారంభోత్సవంలో తూత్తుకుడి మేయర్ జగన్, జిల్లా పర్యాటకశాఖ అధికారి సీతారామన్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు జరగనున్న ఈ పోటీల్లో విజేతలను అంతర్జాతీయ పోటీలకు ఎంపిక చేయనున్నారు.




డాక్యుమెంటరీ విడుదల చేస్తున్న మంత్రి తంగం తెన్నరసు, ఉన్నతాధికారులు

'వైల్డ్ తమిళనాడు' డాక్యుమెంటరీ ట్రైలర్ విడుదల

చెన్నై, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అటవీశాఖ 'వైల్డ్ తమిళనాడు' పేరుతో రూపొందించిన వన్యప్రాణుల డాక్యుమెంటరీ ట్రైలర్ విడుదలైంది. శుక్రవారం చెన్నైలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక, పర్యావరణ శాఖ మంత్రి తంగం తెన్నరసు, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అనురాగ్ మిశ్రా, సంగీత దర్శకుడు రికీ కేజ్, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ కల్యాణ్ వర్మ, ప్రభుత్వ అదనపు చీఫ్ సెక్రటరీ సుప్రియా సాహు, సుందరం ఫాస్టెనర్స్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ రాకేష్‌కుమార్ డోగ్రా, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ ఆర్.దిలీప్ కుమార్ తదితరులు ఈ డాక్యుమెంటరీ ట్రైలర్‌ను ఆవిష్కరించారు. సుందరం ఫాస్టెనర్స్ నిర్మించిన సీఎస్ఆర్.. పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన ప్రకృతి సోయగాల వీక్షణే లక్ష్యంగా ఆ డాక్యుమెంటరీ రూపొందినట్లు నిర్వాహకులు ఈ సందర్భంగా తెలిపారు.

రేపు ఆరు జిల్లాలకు

17న ఎనిమిది జిల్లాలకు భారీ వర్ష సూచన

చెన్నై, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వచ్చే రెండు రోజుల్లో వివిధ ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశముందని చెన్నై వాతావరణ కేంద్రం ప్రకటించింది. సోమవారం ఆరు జిల్లాలు, 17న ఎనిమిది జిల్లాల్లో భారీవర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. ఆ ప్రకారం, సోమవారం వేలూరు, తిరుపత్తూర్, తిరువణ్ణామలై, కృష్ణగిరి, ధర్మపురి, సేలం జిల్లాలు, 17న రాణిపేట, కాంచీపురం, చెంగల్పట్టు, వేలూరు, తిరుపత్తూర్, కృష్ణగిరి, ధర్మపురి, సేలం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. ఇక చెన్నైలో ఆకాశం మేఘావృతంగా ఉంటూ సాయంత్రం, రాత్రి వేళల్లో కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది.

హిందూ ధర్మార్థ సమితి ఆధ్వర్యంలో

22న తిరుపతి గొడుగుల ఊరేగింపు

చెన్నై, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మార్థ సమితి ట్రస్టు ఆధ్వర్యంలో తిరుపతి గొడుగుల ఊరేగింపు ఈ నెల 22న ప్రారంభమవుతుందని ఆ ట్రస్టు అధ్యక్షుడు ఆర్‌ఆర్ గోపాల్‌జీ తెలిపారు. 22వ తేది ఉదయం 10.30 గంటలకు ఫ్లవర్‌బజార్ చెన్నై కేశవపెరుమాళ్ ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఊరేగింపు ప్రారంభమవుతుందన్నారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు ఎలిఫెంట్ గేట్ (గవుని)ను ఊరేగింపు దాటుతుందని తెలిపారు. ఈ ఊరేగింపును ఉడిపి పలిమార్ మఠం పీఠాధిపతి విద్యాధీష్‌తీర్థరు స్వామి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ గొడుగుల ఊరేగింపు ఐదు రోజులపాటు జరుగుతుందని, ఈ నెల 27న తిరుమలేశుడికి గొడుగులను సమర్పిస్తామని ఆయన వివరించారు. తిరుపతి గొడుగుల ఊరేగింపు కోసం తమ సంస్థ విరాళాలను సేకరించదని, ఊరేగింపు సందర్భంగా భక్తులు వ్రతమాచరించి పవిత్రమైన ఆ గొడుగులకు కర్పూరనీరాజనాలు సమర్పించి మొక్కుబడులను తీర్చుకుంటే చాలునని గోపాల్‌జీ తెలిపారు.

చిత్రజ్యోతి

జాన్వీకి తమిళమంటే ఎంతో ఇష్టం

● సిద్ధార్థ్ శంకర్


సిద్ధార్థ్ శంకర్

దివంగత నటి శ్రీదేవి కుమార్తె, హీరోయిన్ జాన్వీకపూర్‌కు తమిళం అంటే ఎంతో ఇష్టమని యువ నటుడు సిద్ధార్థ్ శంకర్ అన్నారు. గతంలో హీరో విజయ్ నటించిన 'ది గోట్', ఇపుడు హీరో శివకార్తికేయన్ నటించిన 'మదరాసి' లో నటించిన సిద్ధార్థ్ శంకర్.. తన సినీ కెరీర్, తాను నటించే చిత్రాలు తదితరాలను మీడియాతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'మా సొంతూరు తిరుపత్తూరు. నేను మలేసియాలో పుట్టి పెరిగా. అక్కడే మెడిసన్‌లో చేరాను. కానీ, సినిమాలపై వ్యామోహంతో చదువును అర్ధాంతరంగా ఆపేసి ఇక్కడికి వచ్చాను. మలేసియాలో ఉన్న సమయంలో హీరో విజయ్ ఆంటోనిని కలిసే అకాశం వచ్చింది. ఆ అవకాశమే కోలీవుడ్‌లో నాకు సినిమా ఛాన్సులు వచ్చేందుకు దోహదపడ్డాయి. విజయ్ ఆంటోని సిఫార్సుతో 'సైతాన్'లో తొలి అవకాశం వచ్చింది. ఆ తర్వాత సిబి రాజ్ నటించిన 'సత్య', హీరో విక్రమ్ నటించిన 'కడారాం కొండన్' ల్లో నటించా. విక్రమ్ వంటి ప్రతిభావంతులైన నటులతో నటించే అవకాశం రావడం నా అదృష్టం. అలాగే, విజయ్ ఆంటోని నటించిన 'కొలై', ధనుష్ దర్శకత్వం వహించిన 'నిలావుక్కు ఎన్నడి ఎన్‌మేల్ కోబమ్'లో నటించా. ధనుష్‌తో కలిసి సెట్‌లో గడిపిన సమయంలో అనేక విషయాలు నేర్చుకున్నా. నటుడు నాజర్ వద్ద తీసుకున్న శిక్షణ ఉపయోగపడింది. శివకార్తికేయన్ చాలా సింపుల్‌గా ఉంటారు. బాలీవుడ్ చిత్రం 'పరమ్ సుందరి'లో నటించా. జాన్వీ కపూర్‌తో కలిసి రొమాన్స్ చేశా. సెట్‌లో ఎవరైన తమిళంలో మాట్లాడితే చాలు జాన్వీ తెగ సంతోషపడిపోతుంటారు. తమిళం అంటే ఆమెకు అంత అభిమానం. కోలీవుడ్‌లో వరుస చిత్రాల్లో నటిస్తున్నా. రజనీ, కమల్, అజిత్ చిత్రాల్లో నటించే అవకాశం కోసం ఎదురు చూస్తున్నా' అని వివరించారు.

సోషల్ మీడియాకు ఐశ్వర్యలక్ష్మి దూరం



తమిళంలో క్రేజీ హీరోయిన్‌గా గుర్తింపు పొందిన ఐశ్వర్యలక్ష్మి సోషల్ మీడియాకు దూరమయ్యారు. ఈ మేరకు ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. అందులో 'సోషల్ మీడియా నాకు వాస్తవ చింతనను దూరం చేస్తోంది. అక్షరాలను, మాతృభాషకు విఘాతం కలిగిస్తోంది. ఇక నుంచి ప్రతి ఒక్కరితో నేరుగా టచ్‌లో ఉంటూ నా జీవితాన్ని సంతోషకరంగా మార్చుకుంటా. జీవితంలో అర్థవంతమైన సంబంధాలను, సినిమాను సృష్టించుకుంటానని బలంగా నమ్ముతున్నా. ఇందుకోసం ప్రతి ఒక్కరి మద్దతును కోరుతున్నా' అని ఐశ్వర్యలక్ష్మి పేర్కొన్నారు. కాగా, విశాల్ నటించిన 'యాక్షన్' మూవీతో తమిళంలో ఎంట్రీ ఇచ్చిన ఐశ్వర్య... 'జగమే తందిరం', 'గార్గి', 'కెప్టెన్', 'పొన్నియిన్ సెల్వన్', 'గట్టా కుస్తి' వంటి చిత్రాల్లో నటించి గుర్తింపుతో పాటు పేరును సంపాదించుకున్నారు.


'అడియే వెల్లళగి' ఆడియో రిలీజ్

'అడియే వెల్లళగి' ఆల్బమ్ రిలీజ్

కొత్త నటీనటులు కేసీపీ మిథున్ చక్రవర్తి, జీవిత నటించిన 'అడియే వెల్లళగి' అల్బమ్ సాంగ్‌ను వందమంది సినీ ప్రముఖులు విడుదల తాజాగా విడుదల చేశారు. కేవలం ఒక అల్బమ్ సాంగ్‌ను ఇంతమంది సినీ ప్రముఖులు రిలీజ్ చేసిన సందర్భాలు కోలీవుడ్‌లో ఇంతవరకు లేదు. ఈ నెల 12న విడుదలకానున్న ఈ ఆల్బమ్ సాంగ్‌ను కట్టెరుప్పు స్టాలిన్ సొంతంగా నిర్మించారు. ముత్తయ్య దర్శకత్వంలో వచ్చిన 'కొడి వీరన్'లో బాల నటుడిగా నటించిన మిథున్ చక్రవర్తి... 'బిల్లాపాండి', 'కరుప్పు పెట్టి' వంటి చిత్రాల్లో చిన్న పాత్రలను పోషించారు. ఇపుడు గుహన్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రంలో ముఖ్య పాత్రలో నటిస్తున్నారు. బాల్యం నుంచి సినిమాల్లో నటించాలన్న ఆసక్తితోనే ప్రస్తుతం బీఎస్సీ విస్‌కామ్ విద్యను అభ్యసిస్తున్న మిథున్ చక్రవర్తి... త్వరలోనే పూర్తి స్థాయి హీరోగా నటించనున్నారు. ఈ నేపథ్యంలో మహ్మద్ ఇంతియాజ్ దర్శకత్వంలో ఆయన నటించిన ఈ ఆల్బమ్ సాంగ్‌ను దర్శకులు ఆర్‌వీ ఉదయకుమార్, సర్గుణం, మోహన్ జీ, శరవణ శక్తి, తిరుమలై, మంజు దివాకర్, నిర్మాత ఆర్‌కే సురేష్ ఇలా అనేక మంది సినీ ప్రముఖులు రిలీజ్ చేశారు.

విభజిత గ్రామాలను కలిపిన ఇద్దరు స్నేహితులు


శివాత్మిక - అర్జున్ దాస్

చిన్న సమస్య కారణంగా రెండుగా విడిపోయిన గ్రామాలను ఇద్దరు స్నేహితులు ఎలా కలిపారన్న కథాంశానికి హాస్యాన్ని జోడించి నిర్మించిన చిత్రం 'బాంబ్'. అర్జున్ దాస్ హీరోగా నటించగా, కాళి వెంకట్ ముఖ్య పాత్రను పోషించారు. ఇందులో వీరిద్దరూ స్నేహితులుగా నటించి, సినిమా ఆఖరి వరకు నవ్వుల వర్షం కురిపించారు. విశాల్ వెంకట్ దర్శకుడు. తాజాగా విడుదలైన ఈ చిత్రం గురించి దర్శకుడు మాట్లాడుతూ... 'ఇది ఒక హాస్య భరిత చిత్రం. ఒక ఫాంటసీ వరల్డ్‌ను సృష్టించడంలో విజయం సాధించాం. విభజనకు గురైన రెండు గ్రామాలను ఇద్దరు స్నేహితులు ఎలా కలిపారన్న చిన్న పాయింట్‌తో తెరకెక్కించాం. అర్జున్‌దాస్, కాళివెంకట్ తమ పాత్రలను సమర్థవంతంగా పోషించారు. ఇందులో అర్జున్‌దాస్ తొలిసారి అమాయక గ్రామీణ యువకుడి పాత్రలో కనిపించారు. అనేక సన్నివేశాల్లో కేవలం బనియన్ మాత్రమే ధరించారు. సినిమా క్లైమాక్స్‌లో కథకు తగినట్టుగా ఒదిగిపోయారు. మరో నటుడు కాళి వెంకట్ సినిమా మొత్తం శవంలా నటించి ప్రేక్షకులను మెప్పించారు. హీరోయిన్‌గా శివాత్మిక రాజశేఖర్ నటించారు' అని పేర్కొన్నారు.



ఓంబిర్లాతో మాట్లాడుతున్న రఘురామ కృష్ణమరాజు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమలలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా శనివారం తిరుమలకు చేరుకున్నారు. శ్రీకృష్ణ అతిథిగృహం వద్ద టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. ఆదివారం ఉదయం ఆయన శ్రీవారిని దర్శించుకోనున్నారు. ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కొద్దిసేపు లోక్‌సభ స్పీకర్‌తో ముచ్చటించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



తిరుమలేశుడిని భక్తులు ప్రశాంతంగా దర్శిస్తున్నారు

● మంత్రి సవిత

తిరుమల, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తులు ఎంతో ప్రశాంతంగా వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్నారని మంత్రి సవిత అన్నారు. తిరుమల శ్రీవారిని శనివారం ఉదయం ఆమె దర్శించుకున్నారు. వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. అనంతరం మంత్రి ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ తిరుమలలో అందిస్తున్న అన్నప్రసాదాలు, వసతి, దర్శనాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజలకు శ్రీవారి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించినట్టు చెప్పారు.


సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ కృష్ణ తేజ విశ్రాంతి భవనం మీదుగా శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.4.18 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 69,482

తలనీలాలు సమర్పించినవారు: 28,234





జిల్లా సహకార కేంద్ర బ్యాంకు

డీసీసీబీలో ప్రక్షాళన

- గత పాలకవర్గం హయాంలో జరిగిన అక్రమాలపై చర్యలు
- 11మంది ఉద్యోగుల సస్పెన్షన్.... 30మందిపై శాఖాపరమైన చర్యలు
- ముగ్గురు సర్వీసు నుంచి తొలగింపు.. నలుగురు రిటైర్డు ఉద్యోగులపైనా చర్యలు



మాజీ సీఈవో మనోహర గౌడ్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో గాడితప్పిన జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో ప్రక్షాళన మొదలైంది.అప్పట్లో పాలకవర్గం నిబంధనలకు పాతరేయడంతో డీసీసీబీ అక్రమాలకు కేంద్రంగా మారింది. ఆర్థిక అవకతవకలపై అప్పట్లో తీవ్ర విమర్శలు వచ్చినా ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక డీఆర్వో నేతృత్వంలో జరిగిన విచారణలో అప్పటి పాలకవర్గం సహకార రంగానికి చేసిన అపకారం తేటతెల్లమైంది.ఇందుకు బాధ్యులుగా భావించి తొలివిడతగా 48మంది బ్యాంకు ఉద్యోగులపై వేటు పడింది.అక్రమాలకు బాధ్యులైన పాలకవర్గ సభ్యులపై మలివిడతలో చర్యలు తీసుకోనున్నారు.

రూ. 75కోట్లకు మించి ఆర్థిక అవినీతి

వైసీపీ హయాంలో డీసీసీబీకి ఎన్నికలు నిర్వహించకుండానే పర్సన్ ఇన్‌చార్జి కమిటీలతో కథ నడిపించారు. నాటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆశీస్సులతో సెవెన్‌మెన్ కమిటీ డీసీసీబీలో అధికారాలను వెలగబెట్టింది.ఐదేళ్లపాటు బ్యాంకు చైర్‌పర్సన్‌గా రెడ్డెమ్మ కొనసాగారు.ఆమెతో పాటు డైరక్టర్లు, బ్యాంకు ఉద్యోగులు, వైసీపీ నేతలు కలసిపోయి పెద్దఎత్తున అవినీతి అక్రమాలకు తెరతీశారు.ఉద్యోగ నియామకాల్లో డబ్బులు వసూలు చేయడం,అవసరం వున్నా లేకపోయినా వాహనాల కొనుగోళ్లు జరపడం, భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయడం,బినామీ పేర్లతో కోట్లాది రూపాయలను రుణాలుగా తీసుకుని చెల్లించక పోవడం వీటిలో కొన్ని. దాదాపు రూ.75 కోట్లకు పైగా డీసీసీబీలో అవినీతి అక్రమాలు జరిగాయని అంచనా.ఈ విషయాలపై ఆంధ్రజ్యోతి అప్పట్లోనే పలు కథనాలు ప్రచురించిన విషయం తెలిసిందే.ప్రస్తుత ప్రభుత్వ ఆదేశాలతో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఈ వ్యవహారంపై డీఆర్వో మోహన్‌కుమార్‌తో విచారణ జరిపించారు. సహకార చట్టం 51వ సెక్షన్ ప్రకారం జరిగిన విచారణలో అక్రమాల గుట్టును తేల్చారు. ఈ అవినీతి పర్వంపై తదుపరి విచారణకు జిల్లా సహకార బ్యాంకు ప్రత్యేక సర్వసభ్య సమావేశం శుక్రవారం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.ఈ నేపథ్యంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు డీసీసీ బ్యాంకు అధికారులకు తగుచర్యలు వెంటనే చేపట్టాలని శనివారం డీసీవో లక్ష్మి సూచించారు. దీంతో బ్యాంకు అధికారులు చర్యలకు ఉపక్రమించారు. శనివారం సెలవు రోజైనా బాధ్యులందరిపై చర్యలు తీసుకుంటూ నోటీసులు జారీ చేశారు.అక్రమాలకు బాధ్యులైన పాలకవర్గ సభ్యులపై, వైసీపీ ముఖ్యులపై తొందరలో చర్యలు తీసుకోనున్నారు.

ముగ్గురు సర్వీసు నుంచి తొలగింపు

డీసీసీబీ వ్యవహారాల్లో అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణల కారణంగా మరో ఏడుగురిపై చర్యలు చేపట్టారు. ఉద్యోగ నియామకాల్లో జరిగిన అక్రమాలపై బాధితులు ఫిర్యాదు చేసినా గత పాలకవర్గం ఎలాంటి చర్యలు తీసుకోలేదు.నిబంధనలకు విరుద్ధంగా పర్మినెంట్ అయిన డి. జయప్రకాష్ (స్టాఫ్ అసిస్టెంట్), టి. శ్రీలక్ష్మీప్రసన్న (మేనేజర్), బి. గురునాథం (స్టాఫ్ అసిస్టెంట్)లను తొలగిస్తూ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. బ్యాంకులో గత పాలకవర్గానికి మద్దతుగా తప్పుడు చర్యలకు పాల్పడిన రిటైర్డ్ అధికారులు ఎస్. ఆషాబీ (ఏజీఎం), వై. యోగీశ్వర్ రెడ్డి (ఏజీఎం), కె. కిరణ్‌కుమార్ రెడ్డి (డీజీఎం), సి. సుబ్రహ్మణ్యం (మేనేజర్)లకు నోటీసులు జారీచేశారు.

11 మంది సస్పెన్షన్... 30 మందిపై శాఖాపరమైన చర్యలు

డీసీసీ బ్యాంకు అవకతవకలకు సంబంధించి ఉన్నతాధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బంది దాకా 30మందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటూ శనివారం రాత్రి వారందరికీ నోటీసులు జారీచేశారు. మరో 11 మందిపై సస్పెన్షన్ వేటు వేశారు.అప్పటి బ్యాంకు సీఈవో, ప్రస్తుతం జీఎంగా వ్యవహరిస్తున్న ఇ. మనోహర్ గౌడ్, ఏజీఎం టి. చంద్రకళ, చీఫ్ మేనేజర్లు జె. సందీప్, కె. నవీన్ కుమార్, కె. త్యాగరాజు, మేనేజర్లు కె. వెంకటేష్ బాబు, ఆర్. పుష్పలత, ఎం. రమేష్, వి. మోహన్‌కుమార్, అసిస్టెంట్ పి. లక్ష్మారెడ్డి, స్టాఫ్ అసిస్టెంట్ మహమ్మద్ యాసీన్ సస్పెండైన వారిలో వున్నారు.

అమ్మవారి సేవలో కేంద్ర ఆర్థిక మంత్రి



నిర్మలా సీతారామన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న బీజేపీ నేతలు

తిరుచానూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతీ అమ్మవారిని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం దర్శించుకున్నారు. ఆలయం వద్ద జేఈవో వీరబ్రహ్మం, టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, అర్చకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. మొదట ధ్వజస్తంభానికి నమస్కరించి, తర్వాత సన్నిధిలోని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల బీజేపీ నేతలు ఆమెకు రాములవారి చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు. సాయంత్రం హైకోర్టు అడ్వకేట్ జనరల్ దొమ్మలపాటి శ్రీనివాస్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రమేష్ స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వరుస సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచేగాక పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. 30వేల మంది దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 426, రూ.200 శీఘ్ర దర్శనం 3,581మంది, రూ.50ప్రత్యేక దర్శనం 2,611మంది దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 3,077మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,349, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 337మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 212మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 93మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 25.360 అమ్ముడైనట్లు ఆలయాధికారులు తెలిపారు.

ఎస్పీగా సుబ్బరాయుడు

● ప్రకాశం జిల్లాకు హర్షవర్ధనరాజు



హర్షవర్ధనరాజు



సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీగా సుబ్బరాయుడిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ ఎస్పీగా పనిచేస్తున్న హర్షవర్ధనరాజును ప్రకాశం జిల్లాకు బదిలీ చేసింది. సుబ్బరాయుడు ఆదివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. గత ఏడాది మే 14న జిల్లా ఎస్పీగా హర్షవర్ధ రాజు బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం ఘర్షణలు, విద్వేషాలు చోటుచేసుకోకుండా గట్టి చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కడప జిల్లాలో నెలకొన్న ఘటనలు, శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని ఆయన్ను అక్కడికి బదిలీ చేసింది. తెలంగాణా క్యాడర్‌లో ఉన్న సుబ్బరాయుడిని ఏపీకి రప్పించి తిరుపతి జిల్లాకు ఎస్పీగా నియమించింది. ఆయన గత ఏడాది జూలై 15న బాధ్యతలు స్వీకరించారు. దాదాపు ఆరు నెలలు విధులు నిర్వహించారు. ఈ ఏడాది జనవరిలో వైకుంఠ ఏకాదశి దర్శన టికెట్ల జారీ ప్రక్రియలో తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటన నేపథ్యంలో ఆయన్ను ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జిగా బదిలీ చేసింది. తొక్కిసలాట ఘటనపై విచారణ జరిపిన ఏకసభ్య కమిషన్ క్లీన్ చిట్ ఇవ్వడంతో ఆయన్ను జిల్లా ఎస్పీగా ప్రభుత్వం నియమించింది. ఇలా తిరుపతి జిల్లాకు రెండుసార్లు ఎస్పీగా పనిచేసే అవకాశం వారిద్దరికీ దక్కింది.

గంజాయిపై ఉక్కుపాదం

జిల్లాలో పనిచేసిన ఆరు నెలల కాలంలో గంజాయి అక్రమ రవాణాపై సుబ్బరాయుడు ఉక్కుపాదం మోపారు. ఎర్రావారిపాళెంలో బాలికపై అత్యాచారం ఘటనలో 24 గంటలు తిరక్క ముందే నిందితుడిని అరెస్టు చేయించారు. మహిళలపై అఘాయిత్యాలు జరగకుండా రక్షక్ టీమ్‌లు ఏర్పాటు చేసి విద్యా సంస్థల్లో అవగాహన కల్పించారు.

టెక్ పోలీసుకు ప్రాధాన్యం

జిల్లా పోలీసు శాఖలో టెక్నాలజీకి హర్షవర్ధనరాజు ప్రాధాన్యత ఇచ్చారు. నేరాల కట్టడిలో డ్రోన్లు వినియోగించి సఫలీకృతులయ్యారు. ఆటోలకు డిజిటల్ స్టిక్కర్లు ఏర్పాటు చేయించారు. ట్రాఫిక్ నియంత్రణలో డ్రోన్లు వినియోగించి విజయవంతమయ్యారు. తిరుపతి, జీవకోన, మంగళంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రౌడీలపై ఉక్కుపాదం మోపారు. జీవకోనలో అవుట్ పోస్టు పోలీసు స్టేషన్ ఏర్పాటు చేశారు. అన్ని కూడళ్లలో ట్రాఫిక్ అవుట్ పోస్టులు ఏర్పాటు చేసి, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు.



ఒక్కటైన సుబ్రమణ్యం, రంజిత దంపతులు





ఒక్కటైన చంద్రశేఖర్, పల్లవి దంపతులు - ఒక్కటైన వెంకటేష్, రాసాతి దంపతులు

లోక్ అదాలత్‌లో ఒక్కటైన మూడు జంటలు

పుత్తూరు అర్బన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాజీ మార్గమే రాజ మార్గమని సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర పేర్కొన్నారు. శనివారం పుత్తూరు కోర్టులో జరిగిన లోక్ అదాలత్‌లో 214 కేసులు పరిష్కరించారు. ఇందులో ముఖ్యంగా మూడు జంటలు ఒక్కటయ్యాయి. న్యాయమూర్తి రాఘవేంద్ర వారికి కౌన్సెలింగ్ ఇచ్చి ఒక్కటి చేశారు. న్యాయవాదుల సంఘం కార్యదర్శి రాజేష్ పాల్గొన్నారు.

● నారాయణవనం మండలం కొండల చెరువు గ్రామానికి చెందిన బలరామ్ తన భార్య రంజితను కాపురానికి ఆహ్వానిస్తూ 2024లో కోర్టును ఆశ్రయించాడు. లోక్ అదాలత్‌లో రంజిత భర్తతో జీవించేందుకు అంగీకరించింది. సహకరించిన న్యాయవాదులకు మురగేషన్ రెడ్డి, రాజారెడ్డిలను అభినందించారు.

● నెల్లూరు జిల్లా కావలికి చెందిన చంద్రశేఖర్‌కు నారాయణవనానికి చెందిన పల్లవితో వివాహమైంది. దంపతుల మధ్య మనస్పర్థలు ఏర్పడి పల్లవి పుట్టింటికి వచ్చింది. ఈ క్రమంలో చంద్రశేఖర్ విడాకుల కోసం పుత్తూరు కోర్టులో ఈ ఏడాది కేసు దాఖలు చేశారు. లోక్ అదాలత్‌లో వీరి మధ్య రాజీ కుదిర్చారు. న్యాయవాదులు గాలి సురేష్, లక్ష్మీ నారాయణలను జడ్జి అభినందించారు.

● నందిమంగళానికి చెందిన వెంకటేష్‌కు కార్వేటినగరానికి చెందిన రాసాతి దంపతులకు ఇద్దరు పిల్లలు. వరకట్నం కోసం వేధిస్తున్నారని రాసాతి ఆరేళ్ల క్రితం కేసు దాఖలు చేసింది. ఈ కేసును అదనపు జూనియర్ సివిల్ జడ్జి రమ్యసాయి, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జానకి విచారణ చేశారు. కౌన్సెలింగ్ ద్వారా ఈ దంపతులను ఒక్కటి చేశారు. సహకరించిన న్యాయవాది రాజేష్‌ను న్యాయమూర్తులు అభినందించారు.

రేపు జూనియర్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జూనియర్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు ఈనెల 15న నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక ఎస్వీయూ స్టేడియం వేదికగా జరుగనున్న ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 20 సంవత్సరాల లోపు వయస్సు ఉండాలని, బాలుర బరువు 75కిలోల లోపు, బాలికల బరువు 65కిలోల లోపు ఉండాలని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 9440078979, 7993014997, 7032467395లను సంప్రదించాలని కోరారు.

తిరుమలలో ప్రతి అంగుళాన్ని మానిటర్ చేయాలి

● అధికారులను ఆదేశించిన ఈవో అనిల్‌కుమార్ సింఘాల్



తిరుమల, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని పలు ప్రాంతాల్లో టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీసీ కెమెరాల పనితీరును వీడియోవాల్ ద్వారా వీక్షించారు. తిరుమలలోని ప్రతి అంగుళాన్ని మానిటర్ చేయగల విధంగా సిబ్బందిని నియమించి కమాండ్ కంట్రోల్ సెంటర్ సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. ఎల్ అండ్ టీ సిబ్బందితో కూడా ఈవో టెక్నాలజీ వినియోగంపై చర్చించారు. అనంతరం పీఏసీలోని లగేజీ కౌంటర్‌ను పరిశీలించి కొందరు భక్తులతో మాట్లాడారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్2కు చేరుకుని భక్తులకు అందిస్తున్న సౌకర్యాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం, మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతాలకు చెందిన శ్రీవారి సేవకులతో మాట్లాడారు. శ్రీవారి సేవకులకు మరింత నాణ్యమైన శిక్షణ ఇచ్చి తద్వారా భక్తులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సీపీఆర్వో రవికి సూచించారు. ఈ తనిఖీల్లో ఈవోతో పాటు సీవీఎస్వో మురళీకృష్ణ, డిప్యూటీ ఈవో సోమన్నారాయణ, వీఎస్వోలు రామ్‌కుమార్, సురేంద్ర, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్ పాల్గొన్నారు.

పరిశ్రమల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

● పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి యువరాజ్



వర్చువల్‌గా మాట్లాడుతున్న పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.యువరాజ్ - హాజరైన పారిశ్రామికవేత్తలు



తిరుపతి అర్బన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మార్కెట్‌తో పోటీపడాలంటే ఉత్పత్తులు తయారుచేయడమే కాకుండా పరిశ్రమలు నైతిక విలువలు పాటించాలని, నాణ్యతా ప్రమాణాలను నిలబెట్టుకోవాలని పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.యువరాజ్ అన్నారు. శనివారం ఉదయం స్థానిక కెన్సెస్ హోటల్లో ఏర్పాటుచేసిన సులభతర వాణిజ్య అవగాహన ప్రాంతీయ సదస్సుకు పరిశ్రమల శాఖ జీఎం చంద్రశేఖర్, కలెక్టర్ వెంకటేశ్వర్ హాజరుకాగా వర్చువల్‌గా యువరాజ్ పరిశ్రమల యజమానులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు, ప్రభుత్వం కలసి ముందుకు వెళితేనే ప్రపంచ స్థాయిలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ముందు వరుసలో ఉంటామని అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో రాష్ట్రం సింగిల్ విండో సిస్టమ్, మీ సేవా కేంద్రాలు, గ్యారెంటీ యాక్ట్ వంటి కార్యాచరణ చేపట్టిందన్నారు. చిన్నస్థాయి వ్యాపారాలు ఏ అనుమతి లేకుండా వెంటనే ప్రారంభించేలా జాబితా తయారు చేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమలకు సంబంధించిన ప్రతినిధుల సమస్యలు, అభ్యర్థనలు సేకరించి ఆన్‌లైన్‌లో ఉంచాలన్నారు. తిరుపతి-నాయుడుపేట జాతీయ రహదారి, గూడూరు-రేణిగుంట రైల్వే ట్రిప్లింగ్, కృష్ణపట్నం పోర్టులు, తిరుపతి ఎయిర్‌పోర్ట్ లభ్యతతో ఈ ప్రాంత తూర్పుతీరంలో పెట్టుబడులకు అత్యంత అనుకూలంగా ఉందన్నారు. వచ్చే 10-15 ఏళ్లలో త్రిభుజ ప్రాంతం(నెల్లూరు-తిరుపతి-చెన్నై)అగ్రశ్రేణి పారిశ్రామిక కేంద్రంగా అవతరించనుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జెడ్‌ఎం విజయ్‌భరత్‌రెడ్డి, పరిశ్రమశాఖ డీడీ మురళి పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనలే ఆవిష్కరణలకు పెట్టుబడి

● డీఆర్‌డీవో మాజీ చైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డి



విద్యార్థులతో డాక్టర్ సతీష్‌రెడ్డి

తిరుపతి రూరల్, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): సరికొత్త ఆలోచనలే గొప్ప ఆవిష్కరణలకు పెట్టుబడిగా నిలుస్తాయని డీఆర్‌డీవో మాజీ చైర్మన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులు వైవిధ్య ఆలోచనలతో ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కరకంబాడీరోడ్డులోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం విద్యార్థులకు ఇన్‌స్పైరింగ్ మైండ్స్ ఇంటరాక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సతీష్‌రెడ్డి మాట్లాడుతూ.. మనదేశంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. ఇంక్యుబేషన్ కేంద్రాలు అందుబాటులో రావడంతో పరిశోధకులసంఖ్య బాగా పెరిగిందన్నారు. ఏపీలో టాటాసంస్థతో కలసి ఇంక్యుబేషన్ రీసెర్చ్ కేంద్రాల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు సారథ్యంలో కృషి జరుగుతోందన్నారు. రక్షణ రంగంలో స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన ఆయుధాలను ఎగుమతిచేస్తున్నామన్నారు. కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవింద్‌కుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వాసు పాల్గొన్నారు.

తిరుపతి-అనకాపల్లి, విశాఖపట్నం మధ్య ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో నెలకొన్న రద్దీని దృష్టిలో ఉంచుకొని తిరుపతి-అనకాపల్లి, విశాఖపట్నం మధ్య అక్టోబరులో ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు. తిరుపతిలో అక్టోబరు 5, 12, 19, 26 తేదీల్లో ఈ ప్రత్యేక రైలు(07481) బయలుదేరి మరుసటి రోజుకు అనకాపల్లి చేరుకుంటుంది. అనకాపల్లిలో ఈ ప్రత్యేక రైలు (07482) అక్టోబరు 6, 13, 20, 27 తేదీల్లో బయలుదేరి మరుసటి రోజు తిరుపతి చేరుకుంటుంది. ● విశాఖపట్నం - తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు (08583-08684) ఈ నెల 15వ తేదీ నుంచి నవంబరు 25వ తేదీ వరకు రాకపోకలు సాగిస్తాయి. ఈ రైళ్లు విశాఖపట్నంలో ఈ నెల 15వ తేదీ సోమవారం, తిరుపతిలో 16వ తేదీ మంగళవారం బయలుదేరుతాయని సీపీఆర్వో తెలిపారు. తిరుమల ఎక్స్‌ప్రెస్ మార్గంలోనే ఈ ప్రత్యేక రైళ్లు రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు.



అంగన్‌వాడీ సిబ్బందికి బాలికను అప్పగిస్తున్న గ్రామస్తులు

గ్రామస్తుల ఔదార్యం

● మతిస్థిమితం లేని బాలికకు ఆసరాగా నిలిచి..

పాకాల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని బాలికను గ్రామస్తులు అక్కున చేర్చుకున్నారు. అంగన్‌వాడీ సిబ్బందికి అప్పగించారు. కుందేటివారిపల్లె సమీపంలోని సామిరెడ్డిపల్లె చెత్తసంపద తయారీ కేంద్రం పరిసరాలలో శనివారం సాయంత్రం 15ఏళ్ల మతిస్థిమితం లేని బాలిక అటూ ఇటూ తిరుగుతోంది. అక్కడికి సమీపంలో వ్యవసాయ పనులు చేస్తున్న కుందేటిపల్లెకు చెందిన చెంగల్రాయనాయుడు గమనించాడు. బండిపై కొంతదూరం తీసుకువచ్చాక ఎక్కడికి వెళ్లాలో చెప్పకపోవడంతో మళ్లీ బాలికను అక్కడే వదిలేశాడు. గ్రామంలో సోంపల్లి ఉమాపతినాయుడు, పాల చిన్న, రామచంద్రయాదవ్‌లకు ఈ విషయం చెప్పాడు. దీంతో నలుగురూ కలిసి వెళ్లి చూస్తే బాలిక ఏడుస్తూ కనిపించింది. డాడీ ఇక్కడ వదిలాడని.. అమ్మ డ్వాక్రా డబ్బులు కట్టడానికి వెళ్లిందని పొంతన లేని మాటలు చెబుతోంది. దీంతో వారు గ్రామానికి తీసుకువచ్చారు. ఓదార్చి భోజనం పెట్టారు. సముదాయించి వివరాలు అడగడంతో పేరు చిన్నూ అని, తండ్రి రామచంద్ర నాయుడు, తల్లి నాగమణి అని, ఊరు చంద్రగిరి అని చెబుతోంది. పోలీసుల సూచన మేరకు వారు ఐసీడీఎస్‌కు చెందిన సుజాతకు విషయం చెప్పారు. బాలికను రేణిగుంట అభయక్షేత్రానికి అప్పగించాలని ఆమె సలహా ఇచ్చి ఊరుకుంది. దీంతో గ్రామస్తులు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని భావిస్తున్న తరుణంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కిరణ్మయి స్పందించింది. జయదేవపురం అంగన్‌వాడీ సిబ్బందిని కుందేటివారిపల్లెకు పంపింది. వారు బాలికను సంరక్షణకు తీసుకెళ్లారు.